## విషయసూచిక


| | | |
|---|---|---|
| నా కుటుంబము... | ఛీఫ్ ఎడిటర్ | 3 |
| క్రీస్తుయేసు సేవ- | బిషప్ గొంది థియోదర్ మార్కు,నంద్యాల | 4 |
| ప్రజాపతిబలియాగం | రెవ.జె.లాజరస్, జమ్మలమడుగు | 6 |
| దేవుడు చేసిన ఉపకారములు | రత్నకుమారి హానోకు, ఇబ్రహీంపట్నం | 8 |
| క్లౌ దొర - సికింద్రబాదు | రెవ. డౌని | 8 |
| బైబిలులో చెప్పబడిన వస్త్రములు | శ్రీమతి నిర్మలమాత్యూస్,ఒంగోలు | 9 |
| పాఠకుల వేదిక | పాస్టర్.యమ్. రాజరత్నం , గిద్దలూరు | 9 |
| అమృతధార | డా॥ కె. దేవిడ్‌లివింగ్‌స్టన్, మార్కాపురం | 10 |
| సాక్ష్యము | ఆచార్య రాయసం రాధాకృష్ణ మూర్తి ,హైదరాబాదు | 12 |
| ఫిబ్రవరి నెల ప్రశ్న | శ్రీ పంతగాని గ్రేషియస్, ఏలూరు | 15 |
| విశ్వాసంలో మరో మెట్టు | కొడవటికంటి | 16 |
| క్రీస్తు దాసు (సాక్షము ) | ఎ.దేవకుమార్ ,మన్నార్ పోనూరు | 18 |
| ఆయన చేసిన ఆశ్చర్యకార్యములు | శ్రీమతి సి.హెచ్. కనికరమ్మ, కోలవెన్ను | 22 |
| యేసు కథ | కొడవటికంటి | 25 |
| సంజీవనాథ స్వామి.... | శ్రీమతి నలంద సాల్మన్‌రాజు,హైదరాబాదు | 26 |
| అంధుల లిపి నిర్మాత | కె.జె.డబ్ల్యు.జయకుమార్. నెల్లూరు | 28 |
| న్యూస్ | హన్నాకృప డెస్క్ | 30 |



**కొడవటికంటి సామ్యేల్ రాజేంద్ర**

చీఫ్ ఎడిటర్, హన్నాకృప

పోస్ట్‌బాక్స్ - 51, డోర్ నెం.54-1-23(ఎ)

కృపాదానంవీధి, క్లాపేట, ఒంగోలు-523 001

9866716506


**సంవత్సర కానుక : రూ.150/-**

**ప్రియపాఠకులారా మీరు పంపే కానుక 500/- మించినప్పుడే ఆన్‌లైన్‌లో వేయండి.**

# HANNA KRUPA®

**Christian Devotional Monthly Magazine**


**సంపుటి : 9** **సంచిక : 8**


THE NATIONAL CHURCH OF INDIA 1958

**ప్రభువగు యెహోవాయే నాకు బలము**


Editor :

**Rev. Nathaniel R. Kodavatikanti,**
B.Th.,M.A.,M.Phil

Cell : 9908822365

Hon. Editor :

**Rev. K. Vijaya Chandra**

Pastor, Hannahkrupa Memorial Church
Bangalore

Hon. Advisor :

**Yadavalli Prasada Rao**

Pay & Accounts Officer, Warangal

Patrons :

**Dr. Y.S. Purushotham Reddy**

Superintendent, Sri Rajareddy Hospital
Pulivendula

**Bishop.Rev. Dr. M.S. Santhavardhan**

Director, Good News Messengers, Guntur

**Dr. Pikkili Hussenaiah**

Sri Parvathi Nursing Home, Besthavaripeta

ఆన్‌లైన్ అకౌంట్ నెం. : **10957294362**
బ్రాంచి నెం. : 0890 స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
అకౌంట్ హోల్డర్: కె. సామ్యేల్ రాజేంద్ర, కృపాదానంవీధి,
క్లాపేట, ఒంగోలు సెల్ : 9866716506

# నా కుటుంబము

అపోస్తలుడైన పౌలు తన ప్రియకుమారతుల్యుడైన తిమోతికి ఉత్తరం వ్రాస్తు – అతనికి అప్పగించిన సంఘములో అధ్యక్ష పదవిని ఆశించిన సంఘస్తుడు మంచి పనిని కోరుకుంటున్నాడు. కాని అతను సంఘమును పరిపాలించేందుకు ముందుగా తన కుటుంబమును ఏలు వాడైయుండవలెనని – తన పిల్లలను స్వాధీనపరచుకొనిన వాడై యుండవలెనంటున్నాడు.

కుటుంబము ఏర్పడుటకు ఇద్దరు కలసి – భార్య, భర్త కుటుంబాన్ని ప్రారంభిస్తున్నారు. ఆ కుటుంబము యొక్క భాద్యత ఇద్దరి మీద ఉండినప్పటికి కుటుంబమునకు తలగా ఉన్నవాడు భర్త, అతడు పెద్ద యుద్ధాలు చేసి లేక ఎలక్షన్‌లో పోటీ చేసి వందల వేల సంఖ్యలో తోటివారిని స్వాధీనపరచు కోగలిగి యుండవచ్చును. లేక ఘనమైన ఉద్యోగము కలిగి తనతో పనిచేసేవారిని స్వాధీనపరచు కొన గలిగియుండ వచ్చును. కాని తన ఇంటిలోపల తన భార్యను పిల్లలను స్వాధీనపరచు కోలేకపోవచ్చును.

ఇక్కడ స్వాధీన "పరచుకొనుడి" అనే మాట చిన్న విషయము కాదు. మనం దేనినైనా స్వాధీన పరచుకోవాలంటే దాని కంటే అన్నిటిలోను హెచ్చయిన స్థితిలో ఉండాలి. మన కుటుంబములో వారిని మనం స్వాదీనపరచు కోవటానికి మనం మనల్ని ప్రేమించుకొనిన దానికంటే కుటుంబ సభ్యులను పిల్లలను ఎక్కువగా ప్రేమించాలి.

ఇంటి యజమాని తననుతాను ప్రేమించుకొనిన దానికంటే తన పిల్లలను ఎక్కువగా ప్రేమిస్తున్నాడని పిల్లలు భార్య ఎరిగియుండాలి. లోబరుచుకోవటానికి వారికై ఎక్కువ సమయము వేచ్చించియుండాలి. ఎక్కువ ఓర్పు కలిగి యుండాలి.

తను – కుటుంబపోషణ కొరకు ఇల్లు వదలిన సమయములో తన ప్రతినిధి తన భార్య. **"ఆమె తన ఇంటి వారి నడతలను బాగుగా కనిపెట్టును" సామె.31**

కాబట్టి కుటుంబమును ఏర్పరుచుకొనిన వారు సంపాదించేదానికన్న కుటుంబ సభ్యులతో గడిపే సమయము తగినంత ఉండాలి. భార్యభర్తలు ఇద్దరిలో ఎవరి ఆలోచనయిన తన ఇంటి మీదకంటే పరాయి ఇంటిమీద ఎక్కువ ఆలోచన కలిగి ఉన్నప్పుడు ఖచ్చితంగా వారు తన పిల్లలను బాగుగా ఏల గలిగిన శక్తి కోల్పోతారు. అందువలన కుటుంబమునకు వచ్చే అపకీర్తి సరిదిద్దుకోలేనిది. అలాగని పరాయి ఇంటిని ప్రేమించకూడదని కాదు.

మనం ఇతరుల కుటుంబము విషయములోనే కాక ఇతరులు మన కుటుంబముతో కలిగి ఉన్న సంబంధము కూడ మన కుటుంబము నెమ్మది పోయేదిగా ఉండకూడదు. అందుకే యెషయా ప్రవక్త హిజ్కియా రాజుతో "నీ ఇంటిలో వారేమేమి చూచిరని" అడిగెను.

మన ఇంటికి వచ్చినవారు మన ఇంటిలో ఏమి చూస్తున్నారో దేవుడు చూస్తున్నాడు. కనుక మన కుటుంబము ఇతరులకు ఏమి చూపిస్తున్నదో దానిని బట్టి, మన ఇంటి భద్రత ఉంటుంది.

యేసుప్రభువు – నన్ను వెంబడింపగోరువాడు తన్నుతాను ఉపేక్షించుకొని తన సిలువను ఎత్తికొని నన్ను వెంబడింపవలెను అన్నాడు. సిలువ ఎత్తుకోవటం, ఉపేక్షించు కోవటం కుటుంబములోనే ప్రారంభమవుతుంది. ఈ కుటుంబ పాఠశాలలో మొదట భార్యభర్త ఎవరి సిలువవారు తరువాత పిల్లల వలన పిల్లలతో సిలువ మొయ్యటం అలవాటు చేసికొంటే ప్రజలతో మనం మోయబోయే సిలువ తేలికగా ఉంటుంది. కనుక జయకరమైన కుటుంబ జీవితం కుటుంబము సిలువ మొయ్యటంతో ప్రారంభం అవుతుంది.

నేడు జయకరముగా సేవ చేస్తున్న దేవుని బిడ్డలు ఎక్కువ మంది కుటుంబములోనే సిలువ మోయడం నేర్చుకొన్నారు. కుటుంబములో ప్రతి సమస్య దేవుడిచ్చిన సిలువ అని మనం నమ్మితే కాడి తేలికగా ఉంటుంది.

జీవితములో జయకరమైన కుటుంబము నడిపిన వారంతా నిజముగా యేసుప్రభువుతో నడుస్తున్న వారే నేను అనుభవపూర్వకముగా అనేక కుటుంబాలను చూసి తెలుసుకొన్నాను.

సాక్ష్యము

# క్రీస్తు యేసు సేవలో నా అనుభవాలు



బిషప్. గొంది థియోడర్ మార్కు, నంద్యాల

"ఔనా అంతేనా మరి మీరు ఇక్కడ ఉన్నారని వారికెట్లు తెలియును" వారు ఒక గురువుగారిని వివాహము చేసికొన్నారు. ఆ గురువుగారి పేరు రెవ. హాకర్ అందువల్ల ఇప్పుడు ఆమె రెవ. హాకర్ అయినారని చెప్పి గురువుగారు మీకు 30 పౌనులు పంపినారు. జనవరి మాసములో మీరు ఈ 30 పౌనుల చెక్కు మార్చుకోవచ్చునన్నారు. ఆ సంవత్సరము ముగ్గురు కాలేజిలలో యుండిరి. ముగ్గురికి ఫిబ్రవరి నెలలో సుమారు రూ. 400/- పరీక్షల ఫీసులు కట్టవలసియుండినది. రెవ. హాకర్ పంపిన చెక్కు కూడ రూ. 400/-లు విలువగలది, ఇది దేవుడు పంపిన సహాయమని ఎంతో వినయముతో కృతజ్ఞత నిండిన హృదయముతో దేవునికి కృతజ్ఞతా స్తోత్రములు చెల్లించినాము. వారు 1986 సంవత్సరమున ప్రభువు సన్నిధి చేరినట్లు రెవ.హాకర్ గురువులవారు తెలిపిరి. వారు బ్రతికినంతకాలము ప్రతి క్రిస్మస్ పండుగకు 10 పౌనులు ఈస్టర్ పండుగకు 10 పౌనులు మాకు బహుమానముగా పంపేవారు. ఇదంతా దేవుని కృపయేగాని మరేమియు లేదు. దేవా నీకే ఘనత మహిమ ప్రభావములు ఇప్పుడు నిరంతరం యుగయుగములకు కలుగునుగాక ! ఆమేన్!.

**14. బాబూ, ఈ అమావాస్యరాత్రియందు ఒక్కరూ ఎట్లా వచ్చినారండీ.**

అది ఉగాది పండుగ అనగా తెలుగు సంవత్సరాది పండుగ, ఈ పండుగ ఎప్పుడూ అమావాస్య దినమే వస్తుంది. నంద్యాలకు సుమారు 15 మైళ్ళ దూరములో ఆత్మకూరుకు వెళ్లే రస్తాలో ఈ గ్రామముంది. దానిపేరు సంతజూటూరు, ఆ గ్రామంలో ప్రతి ఏడు ఉగాది పండుగ దినముందే "హార్వెస్టు ఫెస్టివల్" జరుగుతుంది. ఉగాదికి ముందు దినమందే గురువులమ్మగారు,పిల్లలు ఎడ్లబండిలో చేరుకున్నారు. మేము అప్పుడు కాకనూరు గ్రామంలో ఉంటిమి. వారు వెళ్ళేటప్పుడు నేను కాకనూరులో లేను. కుటుంబము సంతజూటూరు వెళ్ళిన తర్వాత సాయంత్రము ఊరు చేరుకున్నాను. ఉగాది దినమందే సంతజూటూరుకు ఆరు మైళ్ళదూరములో నున్న చిన్నదేవళాపురం అను గ్రామంలో ఉదయము "హార్వెస్టు ఫెస్టివల్" మధ్యాహ్నము సంతజూటూరులో జరుపవలసియుండింది. ఒక నిద్ర పోయినాను. మెలకువ వచ్చింది. బహుశ అది మధ్యరాత్రియై యుండవచ్చు. ఆ చిమ్మచీకటిలో కాకనూరు నుండి కాలినడకను బయలుదేరినాను. సంతజూటూరుకు రోడ్డు మీద వెళ్ళితే అది చుట్టూ దారి నడవలసిన మార్గము దూరమౌతుంది. కెనాల్ కట్టమీద వెళ్ళితే దూరం తక్కువ. అందువల్ల ఆ అర్ధరాత్రి కె.సి.కెనాల్ కట్టమీద పోతున్నాను. ఇరుప్రక్కలు చెట్లు పొదలు దట్టంగా ఉన్నాయి. రాత్రియందు కొన్ని పురుగులు ఒక విధమైన శబ్దములు చేస్తూ ఉన్నాయి. కాళ్ళకు చెప్పులు లేవు. చేతిలో టార్చి కూడ లేదు. దేవుని దయవల్ల నాకు దయ్యాల భయం లేదు. చిన్నగా పాటలు పాడుకొంటూ ఆ రాత్రి ప్రయాణం సాగుతుంది. కెనాల్లో నీళ్ళున్నందున అప్పుడప్పుడు కప్పల బెకబెకలు వినబడుతూ ఉన్నవి. ఆ పొదల్లో మామూలుగా తేళ్లు, పాములు ఉండేవి. కాని ఆ రాత్రి నాకు ఏ అపాయము కలుగలేదు. తెల్లవారు జాము 4 గంటలకు సంతజూటూరు చేరుకొని మందిరములో నిద్రించుచున్న పెద్దలను లేపినాను. అప్పుడు అందరు లేచి ఏంబాబు ఇంత రాత్రి వచ్చినారే ఒక్కరు కెనాల్ కట్టమీద ఎట్లా వచ్చారు. దయ్యాలు అగుపడలేదా అని ఆశ్చర్యపడ్డారు. అందరిని పలుకరించి 6 మైళ్ళ దూరంలో యున్న చిన్నదేవలాపురం వెళ్ళేటప్పటికి ప్రొద్దు పొడుస్తుంది. అక్కడ కోతపండుగ జరిపినాను. ఈ ప్రయాణాల్లో సేవలో ఆ ప్రభువే కాపాడినాడు. దేవునికే స్తోత్రం.

**15. మిస్టర్ మార్క్ ముందుగా ఎందుకు చెప్పలేదండీ.**

మార్చి ఏప్రిల్ మాసములలోనే మామూలుగ గురువులందరు కోతపండుగలు జరుపుకొందురు మేము ఖమ్మం ప్రాంతములో సేవ చేసేటప్పుడు గోపవరము అను ఒక చిన్నగ్రామంలో యుంటిమి. మెయిన్ రోడ్డుకు వెళ్ళాలను కొంటె సుమారు నాలుగు మైళ్ళు నడువాలి. పోస్టు ఆఫీసుకు వెళ్ళాలనుకొంటె మూడు మైళ్ళు నడువాలి. అక్కడ పిల్లలకు పాఠశాల కూడ లేదు. ఆస్పత్రి వెళ్ళాలంటే నాలుగు మైళ్ళు

నడిచి 16 మైళ్ళు బస్సులో వెళ్ళాలి. అట్టి గ్రామంలో యుంటిమి. మా ఇల్లు ఈతాకులతో కప్పినారు. ఇంటికి బండ చప్పట లేదు. మట్టి చప్పటి. వారానికొకసారి పేడతో ఇల్లంతయు అలుకుచుండిరి, గాని ప్రజలు ప్రేమగలవారు. మేమున్న మూడేండ్లు ఎంతో ఆనందంగా ఆ పామర ప్రజలమధ్య సేవించుంటిమి. ఆ దినం బొట్లకుంటయను గ్రామంలో కోతపండుగ జరుపుటకు వెళ్ళియుంటిమి. ఆరాధన ముగిసేటప్పటికి రెండుగంటలయింది. ఇంతలో ఇంటి దగ్గర నుండి ఒకరు వచ్చి అయ్యా చిన్నబ్బాయి చాలా జబ్బుగానున్నాడు. మిమ్మును వెంటనే పిలుచుకొని రమ్మన్నారు. పదినెలల మా అబ్బాయి ఒకవారం నుండి విరేచానాలతో బాధపడుతూ యుండినాడు గాని నాకు తీరికలేనందున ఖమ్మం ఆస్పత్రికి తీసుకొనివెళ్ళలేదు. అందువల్ల పిల్లవాడు బలహీనమైపోయాడు. మా పంతుళ్ళు నాటుమందులు వాడుచుండినారు గాని వాడు ఏమీ బాగుపడలేదు. నేను ఇంటికి వచ్చేటప్పటికి ఇంటి దగ్గర చాలా మంది యుండినారు. నేను ఇంటికి వెళ్ళిన రెండు మూడు నిమిషాలకే ఖమ్మం నుండి ఒక వ్యక్తి జాక్సన్ దొరగారినుండి ఒక జాబు తెచ్చిఇచ్చిరి. అందులో ఏమున్నదంటే అయ్యా! రేపు మట్టలాదివారం. మేము ఎవరము ఇక్కడ ఉండము కాబట్టి ఈ దినం (శనివారం) ఖమ్మం చేరి ఆదివారం ఖమ్మంలో ఆరాధనలు జరపండి అని వ్రాసినారు. పిల్లవాడు మరణావస్తలో యున్నాడు. దొరగారేమో ఖమ్మం రమ్మని జాబు వ్రాసినారు. ఎం చేయాలి మీరైతే ఏమి చేసియుందురు? నాకు ఏమీ తోచలేదు. నా భార్యతో జాబు విషయము చెప్పాను. తానూ ఏమన లేదు. పిల్లవాని దగ్గర కూర్చుండి కన్నీరు కార్చుచు ఈగలు తోలుకుంటూ యుండేది. బయట పంతుల్లందరూ మౌనంగా యున్నారు. అప్పుడు నేను పిల్లవాని దగ్గర మోకరించి వాని తలమీద చేయియుంచి భారముతో ప్రార్థించి ఖమ్మం బయలుదేరిపోయాను. నాలుగు మైళ్ళు నడిచి బస్సు ఎక్కి వెళ్ళాలి. ఆ సాయంకాలము ఖమ్మం చేరి ఆదివారము ఉదయము రెండు ఆరాధనలు జరిపి మధ్యాహ్నము దొరగారి ఇంటిలో భోంచేస్తూంటే జాక్సన్ అమ్మగారు నా వైఖరి చూచి మార్కు మీరు అంత సంతోషంగా లేరు ఏమైంది అన్నారు. అప్పుడు పిల్లవాడి విషయము చెప్పగా ఆమె తొందరపడి ఆస్పత్రికి వెళ్ళి డాక్టరమ్మతో మాట్లాడి మందులు మాత్రలు తెచ్చి బస్‌స్టాండ్‌కు కారును పంపి – పిల్లవాడు బాగలేకుంటే తక్షణం ఖమ్మం ఆస్పత్రికి తీసికొనిరండని పంపిరి. నేను గోపవరం వస్తూ ఉండగా ఆ గ్రామస్థులు కొందరు ఎదురయినారు, పిల్లవాని విషయము అడిగితే ఏదుర్వార్త చెప్తుతారో అని అడుగలేదు. ఇల్లు సమీపించినప్పుడు అక్కడ ప్రజలు లేనందున మనసు నిబ్బరమయింది. దేవుని దయవల్ల పిల్లవాడు కొంచెము బాగైయుండునని ధైర్యంగా ఇల్లు చేరుకొంటిని. ప్రభువుకు స్తోత్రము, పిల్లవాడు నిద్రపోతూ యుండినాడు. పొట్ట ఉబ్బరము విరేచనాలు అన్ని తగ్గిపోయినవి.

నేను ఖమ్మం వెళ్ళిన దినం ఏమి జరిగినదంటే ఆ సాయంకాలము చిన్నపిల్లల జబ్బులను బాగుచేసే ఒక అయుర్వేద వైద్యనిపుణుడు సాయంకాలానికి గోపవరం చేరుకొన్నారు. ఒక రెడ్డి దొరవారు ఈ వైద్యుని కొరకు ఒకరికి పంపినారు. వారు వెళ్ళుతు సాయంకాలమైనందున తన బంధువులున్నందువల్ల ఆ రాత్రి ఆ ఊరిలో గడుపుటకు ఆగిపోయాడు. మా పిల్లవాని విషయము విని వానిని చూచుటకు వచ్చినాడు. ఆ వైద్యుడు తన మందుల సంచి తెమ్మని చెప్పి కొన్ని చూర్ణములు చెట్లవేర్లు బాగా పొడి చేయించి ఏదో చెట్టు వేరు కావాలి అని అన్నాడు. చీకటి పడింది. అప్పుడు చేతిల్యాంపులు పట్టుకొని, వామిదొడ్లన్ని తిరిగి కావలసిన వేర్లు తెచ్చినారు. ఆ మందులు వాటితో ఒక ఆకుపసరు కలిపి ముక్కులో పిండినారు. ఎందుకంటే పిల్లవాడు మందులు మింగే పరిస్థితిలో లేడు. పసరు పిండిన కొంతసేపటికి పిల్లవాడు గట్టిగా రెండు మూడు తుమ్ములు తుమ్మినాడు. అప్పుడు ఆ వైద్యుడు తల్లిని చూచి అమ్మా నీకడుపు చల్లనిది. ఇక ఏం భయంలేదు. పిల్లవాడు బ్రతుకుతాడు అని ఒక ఆకుకు మందు రాచి వెచ్చచేసి పొట్టమీద పెట్టి ఈ పొట్ట ఉబ్బరం తగ్గిపోతుందని అక్కడే కొంతసేపు కూర్చున్నాడు. పొట్ట ఉబ్బరం తగ్గింది. విరేచనం ఆగిపోయింది. పిల్లవాడు బాగా నిద్రపోయి లేచి అమ్మా! పాలు అన్నాడు. దేవుడెంత గొప్పవాడు. ఆయన సేవలో మనము నమ్మకంగా యుంటే మన కష్టాల్లో సాయంచేస్తాడు. దేవా! నీవు ఎంతైన నమ్మతగిన దేవుడవు. నీకు వేలాది వేల స్తోత్రములు.

**(సశేషం)**

# ప్రజాపతి బలియాగం



రెవ. జె. లాజరస్ , జమ్మలమడుగు

మోషే, అహరోనులు తమ కర్రను సముద్రము వైపు చాపగా ఎర్ర సముద్రము రెండు పాయలవగా – ఆరిన నేలపై ఈవల నుండి ఆవలకు ఇశ్రాయేలీయులు చేరియున్నారు. ప్రభువా! నీవు మహోత్కృము గలవాడవు. నీవు ఆశ్చర్యకార్యములు చేయువాడవు, నీవే అద్వితీయ దేవుడవు. **కీర్తన 86:8;**

**తుఫాను గాలిని గద్దించుట :–**

ఆ దినమే సాయంకాలమైనప్పుడు యేసు అద్దరికి పోవుదమని వారితో చెప్పగా వారు జనులను పంపివేసి ఆయనను ఉన్నపాటున చిన్న దోనెలు తీసుకొనిపోయిరి. ఆయన వెంబడి మరికొన్ని దోనెలు వచ్చెను. అప్పుడు తుఫాను రేగగా ఆయన ఉన్న దోనె నిండిపోయెను. ఆయన దోనె అమరమున తలగడ మీద (తలవాల్చుకొని) నిద్రించుచుండెను. వారాయనను లేపి బోధకుడా మేము నశించిపోవుచున్నాము నీకు చింత లేదా? అని ఆయనతో అనిరి. అందులకు యేసు లేచి గాలిని గద్దించి నిశ్శబ్దమై ఊరకుండుమని సముద్రముతో చెప్పగా గాలి ఆగి మిక్కిలి నిమ్మళమాయెను. అప్పుడు ఆయన మీరెందుకు భయ పడుచున్నారు? మీరింకను నమ్మిక లేక యున్నారా! అని వారితో చెప్పెను. వారు మిక్కిలి భయపడి ఈయన ఎవరో గాలియు, సముద్రమును ఈయనకు లోబడుచున్నవని ఒకనితో ఒకడు చెప్పుకొనిరి. శిష్యులింకను ప్రభువు నందు నమ్మకముంచినవారు కారు గనుకనే ఈ విధంగా భయ పడ్డారు. సంపూర్ణముగా ఆయన యందు నమ్మకముంచిన యెడల ఈలోకములో కలుగు వాటికి మనము భయ పడనక్కర లేదు. సమస్తము ఆయన స్వాధీనమున ఉన్నవి. ఆయన తన ధనాగారములో నుండి గాలిని రావించును. **యిర్మీ 51:15;** ఉన్నతమైన మేఘములలో ప్రకాశించు ఎండ ఇప్పుడు కనబడకయున్నను గాలి మేఘములను పోగొట్టి దాని తేటగా కనబరచును, గాలి తన చేతిలోనున్నది. తాను చెప్పినట్లు అది వినును. సముద్రము దాని గర్భము నుండి పొర్లిరాగా తలుపుల చేత దానిని మూసిన వాడు అది తన చోటు దాటి రాకుండా ఇసుకను అడ్డుపరిచి యున్నాడు. తూర్పు గాలి ఎక్కడ నుండి వచ్చి భూమి మీద నక ముఖములను వ్యాపించును? గాలికి గదులను ఏర్పాటు చేసినవాడు. ఆయన ఆజ్ఞను గాలి సముద్రము శిరసావ హించును. **యోబు 37:21,38; 8:24;** ఆయన ఆజ్ఞ ఇవ్వగా అవి అన్నియు కరిగిపోవును – ఆయన తన గాలి విసరచేయగా నీళ్ళు ప్రవహించును. **కీర్తన 146:18;**

**నీటిలోని చేప ద్వారా ఒక, షెకెలు తెప్పించి పన్ను చెల్లించుట:–**

పన్ను వసూలు చేయువారు – ప్రభువు శిష్యుడైన పేతురు నొద్దకు వచ్చి మీ బోధకుడు అరషెకలు పన్ను చెల్లించడా? అని అడిగిరి. యేసు అది ఎరిగి పేతురు మాటలాడక మునుపే సీమోను నీకేమి తోచుచున్నది? భూరాజుల సుంకమును, పన్నును ఎవరి యొద్ద వసూలు చేయుదురు? కుమారుల వద్దనా? అన్యుల వద్దనా? అని అడిగెను. పేతురు అన్యుల వద్దనే అని చెప్పెను. యేసు – అలాగైతే కుమారులు స్వతంత్రులే. అయినను మనము వారికి అభ్యంతరము కలుగజేయకుండునట్లు నీవు సముద్రమునకు పోయి గాలము వేసి మొదట పైకి వచ్చు చేప పట్టుకొని దాని నోరు తెరిచినయెడల ఒక షెకెలు దొరుకును. దానిని తీసుకొని నా కొరకును, నీ కొరకును వారికిమ్మని అతనితో చెప్పెను. ప్రభుత్వములు, ప్రభుత్వాధికారులు, పనివారలు చట్టములు ప్రజల క్షేమము కొరకు దేవునిచేత ఏర్పాటు చేయబడినవి. ప్రభువు సర్వాధికారి, రారాజు అయినను ఆయన మానవావతారము కలిగియున్నాడు. ప్రజలు ప్రభుత్వ చట్టములకు లోబడవలసియున్నది. కాబట్టి కేవలము తనకు మాత్రమే గాక శిష్యునికి కూడ పన్ను కట్టించినాడు. ధనాగారము ఆయన చేతనున్నది. షెకెలును సముద్రము లోపలి చేప ద్వారా తెప్పించినాడు. ఎంత ఆశ్చర్యకరుడు. ప్రజలు చట్టములకు లోబడుట వలన భద్రత, క్షేమము కలిగి బ్రతుకగలరు. **మత్తయి 17:24 –27;** బుద్ధి జ్ఞానముల

సర్వసంపదలు ఆయనయందే గుప్తములైయున్నవి. **కొలస్సీ 2:4,**

### అంజూరపు చెట్టును శపించుట :-

ఉదయమందు పట్టణమునకు మరల వెళ్ళుచుండగా ఆయన ఆకలిగొనెను. త్రోవలో ఉన్న అంజూరపు చెట్టును చూచి దానియొద్దకు రాగా దాని యందు ఆకులు తప్ప మరేమియు కానరాలేదు. అందులో కాయలున్నట్లుగా అది కనబడుతున్నది. ఇక నీవెప్పుడును కాయలు కాయకుందువు గాక అని చెప్పెను. అది ఎండి పోయెను. శిష్యులది చూచి ఎంత త్వరగా ఎండిపోయెనని చెప్పుకొనిరి. మీరు విశ్వాసము కలిగి సందేహపడకుండిన యెడల, ఈ చెట్టును చూచిన మాత్రమే కాదు ఈ కొండను చూచి నీవు ఎత్తబడి సముద్రములో పడవేయబడుదువని చెప్పిన యెడల ఆలాగు జరుగునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను. మీరు ప్రార్థన చేయునపుడు వేటిని అడుగుదురో అవి దొరికినవని నమ్మిన యెడల వాటి నన్నింటిని పొందుదురని వారితో చెప్పెను, పైకి భక్తిపరుల వలె నుండి దాని శక్తిని ఎరుగనివారై యుండకూడదని దాని శక్తిని గ్రహించు విశ్వాసము కలవారై యుండి అనేకులకు ఆశీర్వాదకరముగా నుండవలెనని ప్రభువు కోరుచున్నాడు. **మత్తయి 21:18-26;** నాయందు మీరును మీయందు నా మాటలును నిలిచియుండిన యెడల మీకేది యిష్టమో అడుగుడి. అది మీకను గ్రహింపబడును. (మనము అడుగునది దేవునికి ఇతరులకు అభ్యంతరము కానిదిగ, దేవునికి మహిమ కలిగించేదిగాను మనకు ప్రయోజన కరమైనదిగా ఉండవలెను) **యోహా 15:7;** తిన్నని మార్గమును విడిచి బేయేరు కుమారుడైన బిలాము పోయిన మార్గమును బట్టి... బిలాము దుర్నీతి వలన కలుగు బహుమానమును ప్రేమించెను; అయితే తాను చేసిన అతి క్రమము నిమిత్తము అతడు గద్దింపబడెను. ఎట్లనగా నోరులేని గార్థభము మానవ స్వరముతో మాటలాడి ఆ ప్రవక్త యొక్క వెర్రితనము అడ్డగించెను, దేవుడు తాను సృష్టించిన జీవులతో ఏ పనియైనను చేయించగల శక్తివంతుడు. **3 పేతురు 2:16; సంఖ్యా 22:22-30;** కాకోలములు ఉదయమందు రొట్టెను, మాంసమును అస్తమయమందు రొట్టెను, మాంసమును అతని యొద్దకు తీసుకొని వచ్చుచుండెను. అతడు వాగు నీరు త్రాగుచు వచ్చెను. ఏలియా ప్రవక్త ఆకలిని తీర్చెను. **1రాజు 17:6;**

### వ్యాధుల మీదను, రోగముల మీదను యేసుకధికారము:-

**తీవ్రమైన జ్వరము :-** ప్రభువు శిష్యుడైన పేతురు అత్త తీవ్రమైన జ్వరముతో బాధపడుచు లేవలేని పరిస్థితి కలిగి మంచము పట్టియుండెను. యేసు అతని ఇంటిలోనికి వెళ్ళి జ్వరముతోనున్న ఆమె చేయి ముట్టగానే జ్వరము ఆమెను విడిచెను. వెంటనే ఆమెలేచి ఆయనకు ఉపచారము చేయసాగెను. తనను నమ్మిన వారి వ్యాధి, బాధలను తీసివేయగల శక్తివంతుడైన దేవుడు మానవుని శరీరమును మంటితో నిర్మించిన వాడు. ఆయన కనికరము గల దేవుడు. జీవమును, ఆత్మను అనుగ్రహించిన వాడు ఆయనే. ఆయనను మనము విశ్వాసముతో ప్రార్థించిన మన రోగములు పోతవి. **మత్తయి 8:14-15;**

### రక్తస్రావ రోగము గల స్త్రీ స్వస్థత పొందుట:-

ఏక ధాటిగా రక్తము పోతూ ఉంటుంది. శక్తి హీనత, అలసట, భరించలేని నొప్పులు కలిగించు రోగము మనిషి పాలిపోతుంది. 12 సంవత్సరముల నుండి ఈ రోగముచే బాధపడుచు ఎంతో డబ్బు ఖర్చుచేసి ఎంతో మంది వైద్యులచే పరీక్ష చేయించుకొన్నను స్వస్థత లేక ఇక చనిపోవుట మంచిదని అనుకొనియుండవచ్చును. పరమ వైద్యుడు ఆరోగ్యదాతయైన యేసును గురించి తెలుసుకొన్నది. గొప్ప సమూహముతో ఆయన వస్తూవుండగా ధైర్యము చేసి ఆ గుంపులో దూరి గొప్ప విశ్వాసముతో ప్రభువు యొక్క వస్త్రపు చెంగు వెనుక ముట్టినది. విశ్వాసము నిన్ను బాగుపరచెననగా ఆగడియ నుండి ఆ స్త్రీ బాగుపడెను. **మత్తయి 9:20-22;** అందుకాయన కుమారి నీ విశ్వాసము నిన్ను స్వస్థపరచెను, సమాధానము కలదానవై పొమ్ము, నీ బాధ నివారణయై నీకు స్వస్థత కలుగును గాక! అని ఆమెతో చెప్పెను. **మార్కు 5:34;** ఎంత భయంకరమైన, దీర్ఘకాల వ్యాధియైనను ఆయనను తాకి నందున స్వస్థత కలిగింది. ఇప్పుడైనను ఆయనయందు నమ్మకముంచి ప్రార్థించినట్లైన మీ వ్యాధులు నయమగును.

**(సశేషం)**

# దేవుడు చేసిన ఉపకారములు

శ్రీమతి.రత్నకుమారి, కరీంనగర్.

దేవుని నామమునకు స్తోత్రములు! దేవుడు మన జీవితంలో చేసిన ఉపకారములను మనం మర్చిపోవడం దేవునికి ఇష్టం ఉండదు. పన్నెండు సంవత్సరాల నుండి రక్తస్రావము కలిగిన స్త్రీ రహస్యంగా ప్రభువుని తాకి విశ్వాసముతో స్వస్థత పొందినది. ప్రభువు ఆ విషయములో మౌనంగా లేడు. అందరిముందు ఆ విషయాన్ని ఆమెతోనే చెప్పించి ఆమెకు నెమ్మదినిచ్చాడు. అలాగే నేను ప్రభువుతో నడుస్తున్నందున నా జీవితంలో అనేక సాక్ష్యలు కలిగి మౌనంగా లేను. అనేకులతో పంచుకున్నాను, ఇప్పుడు పాఠకులతో పంచుకునే అవకాశం నాకు ఇచ్చాడు.

1992వ సంవత్సరములో నేను ఒక రోజు నా ఇల్లు కడుగుతున్నాను. అది ఉదయం 10గంటలు సమయము ఆ సమయములో ఇంట్లో ఎవరు లేరు నేను ఒక్కదాన్నే ఉన్నాను. కరెంటు స్టవ్ మీద వంటచేస్తు టేప్‌రికార్డులో యేసయ్య పాటలు వింటు పని చేసుకుంటున్నాను. "రక్షకుడైన నా యేసు రేయి పగలు నన్ను కాపాడు" అనే పాట వింటున్నాను. కరెంటు స్టవ్‌లో కాయిల్స్ 5 నిమిషాల కొకసారి తెగిపోతున్నాయి. నేను ఓపిగ్గా స్టవ్ ఆపి కాయిల్స్ రిపేర్ చేసి మళ్ళీమళ్ళీ అలాగే చేస్తున్నాను. మళ్ళీ తెగిపోయింది. మర్చిపోయి వెళ్ళి అలాగే డైరెక్టగా వెళ్ళి కాయిల్స్ పట్టుకున్నాను. క్రింద అన్ని నీళ్ళు నాకు ఒళ్ళంతా వణుకుతుంది. నాకు ఏమైందో అర్ధం కావడం లేదు. స్టవ్ దగ్గర నుండి కొంచెందూరం వెళ్ళాను. నాతోపాటు వైర్లు వస్తున్నాయి. ఎంటిదా అని చూస్తే ఒక వైరు నా వ్రేలికి అతుక్కుపోయివుంది. అప్పుడు పెద్దగా అరుస్తు యేసయ్య అని కేకవేశాను, నా కేకలు ఎవరికి వినరాలేదు. ఆ సమయంలో ఆ పాట "రక్షకుడైన నా యేసు రేయిపగలు నను కాపాడు" అని చెవికి వినబడింది. నా వెనుక ఒక వ్యక్తి ఉన్నట్లు – ఆ వ్యక్తి – ఆ వైరుని లాగై అన్నట్లు వినబడింది. బోర్డులో నుండి కనెక్షన్ వైరు ఊడిపడింది. హల్లెలూయ! నా ప్రభువు నన్ను కాపాడినాడు, రక్షకుడు నా వెనుకనే ఉండి నాతో మాట్లాడినాడు. వైరు పట్టుకుంటే వదలదు అలాంటిది నా ప్రభువు నాతో ఉన్నాడు ఆయన చేసిన ఉపకారములు దేనిని మరువకూడదు. నా ప్రాణమా ఆయన చేసిన ఉపకారములలో దేనిని మరువకుము.

# క్లౌ దొర - సికింద్రబాదు.

వింద్య పర్వతముల నుండి దక్షణముగా ఉండిన భారతావని – దక్షిణము లేక సంస్కృతములో దక్కనుగా పిలువబడింది. అదంతా కుదించుకుపోయి నర్మాదా – కృష్ణ నదుల మధ్య ప్రదేశముగా భావించబడింది. కాకినాడ భీమునిపట్నం కూడ ఇందులో కలుపబడింది. చివరికి హైదరాబాదు, హనమకొండ, పాలమూరు, నల్గొండ మాత్రం దక్కనుగా పిలువబడింది.

ఇందులో నిజామ్‌కు సంబంధించిన భూమి, 95 వేల చదరపు మైళ్ళుగా ఉండినది. జనబా ఒక కోటి, ప్రజలు అందరూ ముస్లిములు కాక 40,వేలమంది తెలుగు వారు ఉన్నారు. నిజాం హైదరాబాదును రాజదానిగా పరిపాలించాడు.

హైదరాబాదుకు ఉత్తరంగా అయిదు మైళ్ళ దూరములో సికింద్రాబాదు ఉన్నది. జనాబా 50వేలు బ్రిటీష్ పరిపాలనా కాలములో ఈ రెండు పట్టణములకు మధ్యనున్న ప్రాంతములో ఆంగ్లేయుల సైన్యము ఉన్నది. బ్రిటీష్‌వారి పీఠములన్నిటిలో పెద్దది, దానిని "రెసిడెన్సీ" అంటారు?

ఇప్పుడు ఉన్న ఉమెన్సెకాలేజి – కోటి – ప్రాంతము అదే, ఈ రెసిడెన్సీ చుట్టు ఆంగ్లేయ ఆఫీసర్ల నివాసములు ఉండేవి. 1870కి పూర్వము హైదరబాదు అంటే చార్మీనార్ ఏరియా – నిజాం పాలన – పేరుకు స్వతంత్రమే, కాని బ్రిటీష్ వారి అదుపాజ్ఞలలో నడిచేది.

1874లో క్లౌదొర అమెరికా నుండి ఇండియాకు తిరుగుప్రయాణంలో ఆయన వెంటవచ్చిన రెవ. క్యాంప్‌బెల్ దంపతులు నిజాం పాలనలో ఉన్న ప్రాంతములో సువార్త సేవ ప్రారంభించాలని తలపు కలిగి, 1874 డిసెంబరు 7న ఒంగోలులో ఒక ఎద్దుల బండిలో క్లౌదొరతో కలసి ప్రయాణం సాగించి. 16 రోజుల తర్వాత సికింద్రబాదు చేరారు. అప్పటికి మన దేశములో సైకిలు కూడ వాడుకలో లేదు. ఎడ్లబండిలో కంకరరోడ్డు మీద ప్రయాణం చేస్తూ

**మిగతాది24వ పేజీలో..**

# బైబిల్‌లో చెప్పబడిన వస్త్రములు

1. ఉల్లాస వస్త్రము - యెషయా 61:3.
2. స్తుతి వస్త్రము - యెషయా 61:3.
3. ప్రశస్త వస్త్రము - లూకా 15:22.
4. తెల్లని వస్త్రము - ప్రకటన 7:9,3:18.
5. రక్షణ వస్త్రము - యెషయా 61 :10
6. సంతోష వస్త్రము - కీర్తనలు 30:12.
7. నీతి వస్త్రము - యెషయా 61:10. కీర్తనసు .132.
8. రక్తవర్ణ వస్త్రము - యెషయా 63:1. సామెతలు 31:
9. దుఃఖ వస్త్రము - కీర్తనలు 35:14
10. శోభిత వస్త్రము - యెషయా 63:1
11. పెండ్లి వస్త్రము - మత్తయి 22:11
12. సుందర వస్త్రము - యెషయా 52:1
13. సన్నపునార వస్త్రము - మత్తయి 11:8, ప్రకటన 19:8
14. ఉత్సవ వస్త్రము - యెషయా 3:22
15. ఊదారంగు వస్త్రము - లూకా 16:19, మత్తయి 15:17
16. ప్రకాశమానమైన వస్త్రము - లూకా 24:3
17. విచిత్రమైన కుట్టు పనిచేసిన వస్త్రము - యెహే16:10

క్రీస్తునందు ప్రియ దేవుని బిడ్డలారా! పైన చెప్పబడిన రక్షణవస్త్రము నీవు ధరించియున్నచో దుఃఖ వస్త్రము తప్ప మిగిలిన వస్త్రములు ధరించినట్లే. రక్షణ పొందకపోతే దుఃఖవస్త్రము ధరించవలసియుండును. గనుక ఇప్పుడైన రక్షణ పొంది ప్రభువు కొరకు జీవించమని కోరుచున్నాను. అట్టి కృప దేవుడు మనకు అనుగ్రహించును గాక ఆమేన్!!!

**శ్రీమతి. ఆలూరి నిర్మలా మ్యాత్యూస్. ఒంగోలు**

# పాఠకుల వేదిక

హన్నాకృప మాసపత్రిక చాలా బాగుంది. ఏముందిలే అని అనుకుంటారు కొంతమంది. అందులో యేసు స్వామి దగ్గరకు మనుష్యులను నడిపించేవిధానములో ఎంత మంది ఎన్నికష్టాలు పడినది, ఏవిధంగా ప్రార్ధనకు నడిపినది నేర్పించినది. ఆ విధంగా ఎంతో మంది ఎన్నో విధాలుగా కష్టపడి ప్రభువు చెంతకు చేర్పించిన విధానాలు గమనించక కించపరచి వ్రాస్తేవారే భంగమైపోతారు. హన్నాకృప పత్రిక నా ఆత్మీయంగా బలపడడానికి నాకెంతో ప్రోత్సాహమిచ్చుచున్నది.

హన్నాకృప నాకు పంపిన ఛీఫ్ ఎడిటర్‌గార్కి ప్రభువు పేరట వందనములు పంపుచున్నాను. ఆయనకు ఆయన కుటుంబసభ్యులందరూ ఆరోగ్యంగా ఉండాలని నా ప్రార్ధనలో రోజూ ప్రార్ధించుచున్నాను.

హన్నాకృప, పరిశుద్ధత పత్రికలు వేరేపత్రికలకు తీసిపోని విధంగా ఉన్నాయని తెల్పుకొనుచున్నాను.

ఇట్లు
పాస్టర్, యమ్. రాజరత్నం.
ప్రకాశం (జిల్లా)

**ప్రసంగములు పత్రికలో ప్రచురణ కొరకు పంపవద్దు**

సీరియల్

# అమృతధార

11

(కొండెపోగు బి. డెవిడ్ లివింగ్‌స్టన్, మార్కాపురం)

తొలి సృష్టి భూమిపై జరిగినపుడు భూమి దేవదూతల అవాసంగా ఉండేది. అపూర్వమైన ఫలపుష్ప భరితలాలైన వృక్షాలు, ఆహ్లాదభరితమైన నది ప్రవాహాలతో, బ్రహ్మాండమైన జంతువులతో భూమి ఉద్యానవనంగా భాసించేది. ఈ విషయాన్ని బైబిల్ పండితుడైన "డేక్" తన కామెంటరీలో వెల్లడిస్తాడు. భూమి నిరాకారముగానను, శూన్యముగానను ఉండునట్లు దేవుడు దాన్ని సృజింపలేదు అని యెషయా ప్రవక్త తన గ్రంథం 45వ అధ్యాయం 18వ వచనంలో పేర్కొంటాడు. అయితే **ఆదికాండం 1:2**లో భూమి నిరాకారముగానను శూన్యముగానను ఉన్నట్టు చూస్తాం.

అంటే దేవుడు భూమిని కలుగజేసినపుడు అది చక్కగానే ఉంది. ఆ తర్వాతే అది నిరాకారంగా ఎందుకు మారిపోయింది. ఈ మధ్య కాలంలో ఏం జరిగింది?! దేవదూతలతో అలరారే తొలిసృష్టికి ఏం జరిగింది. దేవుడు భూమిని కలుగజేసిన పిదప ఈ భూగ్రహంపై దేవదూతలు సంచరించేవారు. భూమిపై ఒక మహత్తర నాగరికత నెలకొని ఉండేది. ప్రకాశమానమైన వేగుచుక్క వంటి ప్రధాన దూత లూసిఫర్, తదితర దూతల సంగీత నాదాలతో ఈ నేల ఒక దివ్య సంగీత సౌధంగా విలసిల్లేది. ఇట్లా కొంతకాలం గడిచింది. ప్రవక్త **యెషయా 14వ** అధ్యాయంలో పేర్కొన్న రీతిగా లూసిఫర్‌లో దురాలోచన బయలుదేరింది. మహోన్నతునితో తనను తాను సమానుని చేసుకోవాలనే తలంపుతో వాడి హృదయం నిండిపోయింది. అంతే! సర్వం ఇట్టే గ్రహించగల దేవుడు లూసిఫర్‌ను పరలోకంలోని తన స్థానం నుండి పడద్రోశాడు. వాడి అనుచరులూ పడద్రోయబడ్డారు. భూగ్రహం నుండి కూడా వాళ్ళు తరిమివేయబడ్డారు. భూమి నిరాకారంగా శూన్యంగా మారిపోయింది. భూమిపై తొలిసృష్టి తాలుకూ వైభవం తుడిచి పెట్టబడింది. భూగ్రహాన్ని నీళ్ళు ఆక్రమించాయి. ఆ జలములపై దేవుని ఆత్మ అల్లాడుతూ ( కాపాడుతూ) ఉన్నట్టు ఆదికాండం మొదటి అధ్యాయం రెండవ వచనం చెబుతుంది.

**ఔషదమొక్కల పుట్టుక:**

ఆదాముకు పూర్వం కాలపరిధిలేని గతాన్ని డేక్స్ మహాశయుడు ఆదాముకు పూర్వ యుగంగా పేర్కొన్నాడు. తిరిగి దేవుడు తన సంకల్పం చొప్పున భూమిపై ఆరు రోజుల సృష్టిని కల్గించినపుడు నేలపై పూర్వ వైభవం నెలకొంది. ఏదేను నుండి దివ్యనది ప్రవహించింది. ఔషదీ విలువలు గల జీవవృక్షం ఏదేనులో మొలకెత్తింది. ఒకనాడు ప్రీ అడామిక్ పీరియడ్‌లో భూమి మీద ప్రవహించి అంతర్ధానమైన అమృతధార దేవుడు చేసిన పునఃసృష్టిలో ఏదేను నదుల ఒడ్డునే మానవ నాగరికతలు విలసిల్లాయి.

ఆదాముకు పూర్వయుగంలో అమృతధార శాఖలు భూమిని తడపడం వల్ల ఆ నది తాకిడి సోకిన మొక్కలు ఔషధి మొక్కలుగా మారిపోయి ఉండవచ్చు. తొలి సృష్టి వినాశనంలో ఈ ఔషధి మొక్కల బీజాలు భూగర్భంలో దేవుని ఆజ్ఞ మేరకు మిగిలిపోయి తిరిగి పునఃసృష్టిలో తలెత్తి ఉండవచ్చు. అందువల్లే కాబోలు ఆయన తన ఆరు రోజుల సృష్టిలో మూడవ రోజు భూమి వృక్ష సంపదను మొలిపించు గాక! అంటూ భూమికి ఆజ్ఞ జారి చేశాడు. స్థూలంగా చెప్పదలచుకున్నదేమంటే, ఇప్పుడు భూమి మీద ఉన్న ఔషధ మొక్కల ఉనికి ఒకప్పుడు భూతలంపై అమృతధార ప్రవహించింది అనడానికి చక్కని ఋజువు.

**బైబిల్ అక్కడక్కడా విశిష్టమైన మరియు ఔషధ విలువ గల కొన్ని వృక్షాల్ని గూర్చి పేర్కొంది.**

**1.** ప్రజలు మేమేమి త్రాగుదుమని మోషే మీద సణగుకొనగా అతడు యెహోవాకు మొరపెట్టెను. అంతట యెహోవా అతనికి ఒక చెట్టును చూపెను. "అది ఆ నీళ్ళలో వేసిన తరువాత నీళ్ళు మధురములాయెను" **(నిర్గమ 15:25.)**

**2.** పుత్రదాత వృక్షఫలాల్ని గూర్చి **(ఆదికాండం 30:14)**లో **(పరమగీతం 7:13)**లో ఉంది. ఈ ఫలాల్ని తీసుకోవాలని రాహేలు ఎంతో ఆశించింది.

**3.** హిజ్కియాకు జబ్బు చేసినపుడు దేవుడికి మొరపెట్టాడు. ఫలితంగా దేవుడు హిజ్కియా ఆయుష్షు పొడిగించాడు. ప్రవక్త అయిన యెషయా తెచ్చిన అంజూర పండ్ల ముద్దతో రాజు

పుండు నయమైంది. **(11 రాజులు 20:7)**

**4.** అపోస్తులుడైన పౌలు తిమోతికి లేఖ వ్రాస్తూ కడుపు జబ్బు నిమిత్తం ద్రాక్షరసం తీసుకోమని సలహా యిస్తాడు. **(1తిమోతి 5:22)**

**5.** ద్రాక్ష, జల్దరు (ఆపిల్) పండ్లు అలసట పోగొట్టి సేద తీరుస్తాయి. **(పరమగీతం 2:5)**

**6.** మోషే కనాను దేశాన్ని చూచి వచ్చునట్లు మనుష్యులను పంపిస్తూ ఆ దేశంలో చెట్లు ఉన్నవో లేవో కనిపెట్టమని, ఆ దేశపు పండ్లను కొన్ని తీసుకు రమ్మని ఆదేశిస్తాడు. అప్పుడు వారు ద్రాక్ష, దానిమ్మ, అంజూరపు పండ్లు తెచ్చారు. అవి ఆ దేశపు బలిష్టమైన అనాకీయుల ఆహారంలో భాగం **(సంఖ్యా 13:20-23)**

**7**. బోళము, అగరు వంటి వృక్షపు దినుసులను మృతదేహాలు ఎక్కువ కాలం పదిలపరిచేందుకు వాడేవారు. **(ఆదికాండం 50:2,3, యోహాను 19:39,40)**

**8.** పండ్ల వృక్షాల్ని కొట్టివేయరాదు **(ద్వితీ 20:19)**

**9. పరమగీతంలో** శ్రేష్ట వృక్షాల్ని గూర్చిన ప్రస్తావనలున్నాయి.

**10.** చినారు జంగిసాలు చెట్ల చువ్వలు చేసిన అద్భుతం. గొప్పది (ఆదికాండం 30:37)

అబ్రహాము బెయెర్షెబాలో ఒక పిచుల వృక్షము (వేపచెట్ట) నాటి అక్కడ నిత్యదేవుడైన యెహోవా పేరిట ప్రార్థన చేసెను అని ఆదికాండం 21:33లో ఉంది. ఇపుడీ పిచుల వృక్షం (వేపచెట్టు) ఔషధ విలువ ఎంతో మనకు తెలియనిది కాదు.

ఎజ్రా, నెహెమ్యాల కాలంలో ఔషధ జ్ఞానియైన హనన్యాను గూర్చి వ్రాయబడి ఉన్నది. (నెహెమ్యా 3:8) ఆ కాలం నాటికే ఔషధ జ్ఞానం మనిషికి దేవుడిచ్చాడు. అమూల్యమైన వనమూలికల్ని ఏర్పరచాడు.

బైబిల్లో అక్రోట, తాళ, దాడిమ, పుత్రదాత, ఖర్జూర, కర్పూర, అంజూర, జటామాంసి, జల్దరు, పిచుల, దేవదారు, మస్తకి, సరళ, గొంజి, తమాల, ఒలీవ, మేడి, కంబళి, బలురక్కసి, గంధవర్గ ఇత్యాది మొక్కలు వృక్షాల గూర్చిన సమాచారం ఉంది.

మనచుట్టూ ఉన్న, మనకు తెల్సిన కొన్ని ఔషధ మొక్కలను కూడా గుర్తు చేసుకుందాం.

అడ్డతీగ, ఆముదము, ఉసిరి, కాకర, కానుగ, కుంకుడు, గోరింటాకు, చేమదుంప, జిల్లేడు, టేకు, తమలపాకు, తులసి, పాలతీగ, నల్లేరుతీగ, బొప్పాయి, కసింత, పిల్లిపిసర, మునగ, రాగి, సరస్వతి ఆకు, సీతాఫలం మొదలగునవి మరెన్నో, వాటి ప్రయోజనాలు మనకు తెలుసు.

ఒకనాడు ప్రవహించిన అమృతధార తాకిడికి మందు మొక్కలుగా మారిపోయిన హరిత సంపద ఆదాము తర్వాత కూడా నిలిచే ఉన్నది. ప్రపంచ పునఃస్థాపనము అంటే ప్రభువు రాజ్యపాలనలో తిరిగి ఈ సృష్టి మహిమలోనికి ప్రవేశించబోతూ ఉన్నది. **(రోమా 8:19,20.ప్రకటన 22:2)** అప్పుడు తిరిగి దేవుని సింహాసనం వద్ద నుండి విలసిల్లడం చూడబోతాము.

హృదయం ఘోరమైన వ్యాధి గలది అంటుంది బైబిల్. హృదయానికి పట్టిన ఈ జాడ్యం పాపం. ఈ పాపరోగం నుండి విడుదలకు క్రీస్తు రుధిరధారే పరమౌషధం! క్రీస్తు రుధిరధారే అమూల్యమైన అమృతధార.

**(సశేషం)**




## ఎస్.యం.ఎస్. (వాయిస్/టెక్ట్స్) పరిచర్య

**ఎవరైనా ప్రతిరోజు దేవుని వాక్యము (టెక్ట్స్) ఉచితంగా పొందగోరినచో లేదా మీ ప్రియులకు పంపగోరినచో 9908822365 నెంబరును సంప్రదించగలరు.**

ప్రతిరోజు 'హన్నాకృప' పాఠకులకు, శ్రేయోభిలాషులకు, మిత్రులకు దేవుని వాక్యము SMS చేయుటకు సహకారము అందించుచున్న వారందరికి వందనములు. ఈ పరిచర్య ద్వారా ఎంతోమంది ఆత్మీయ మేలులు పొందుచున్నందుకు దేవునికి స్తోత్రములు



సాక్ష్యము

4

# ఆచార్య రాయసం రాధాకృష్ణ మూర్తి

యోహాను 3:36 ద్వారా ఆమె రక్షణ పొందింది. నాకు వ్యతిరేకంగా ఉన్నతన వైఖరిని మార్చుకొని ప్రభువుకు విధేయత చూపి హైదరాబాదు నగరంలో బాప్తీస్మము తీసుకొని సేవలో నాకు సాటియైన సహాయం అయింది.

మేము ఎన్నో ప్రాంతాలు పర్యటించాము. మహబూబ్ నగర్‌లో ఉండి రేడియో సేవ ప్రారంభించాము నాతో పాటు సేవ చేసింది. ఎందరో హిందూ స్త్రీలతో ఉత్తర ప్రత్యుత్తరాలు నడిపి వారిని క్రీస్తు దగ్గరికి తెచ్చింది. క్రీస్తును బట్టి కలిగిన అనేక కష్టాలలో నాతో నిలిచి నాకు భాగస్వామిగా ఎంతో ఆదరణ, చేయూత ఇచ్చింది. ఆమె కోసం దేవునికి సర్వదా కృతజ్ఞుడిని.

దేవుడు మమ్ములను సేవలో విజయం నుంచి అత్యధిక విజయానికి తీసుకొని వెళుతు వచ్చాడు. పరిస్థితులను బట్టి దేవుని ఆజ్ఞ మేరకు మహబూబ్‌నగర్ నుండి కర్నూలుకు అక్కడ నుండి గుంటూరుకు తరలి వచ్చాము. 1969వ సంవత్సరంలో మహబూబ్ నగర్ కల్వరి సంఘంలో నేను సేవకై అభిషేకించబడ్డాను.

గుంటూరులో ఉండగా హిందూ సోదరుల మధ్య చేయడానికి గొప్ప దర్శనం ప్రభువు చూపించాడు. రోమా 9:3 పదేపదే నాకు జ్ఞాపకం రాసాగింది. దేహ సంబంధులైన నా సోదరుల కోసం నేనేం చెయ్యాలి? అనే ప్రశ్న ఎదురైంది. నా సమీప బంధువు లెందరో క్రీస్తును గురించి అపోహలతో సతమతమవుతున్నాను. నేను క్రీస్తును పైకెత్తుతాను. ఆయనే అనేకులను ఆకర్షించుకుంటాడు. అని సేవా దీక్షపూనాను. బ్రాహ్మణ్యం క్రీస్తుకు దూరంగా ఉండిపోవటం నాకు ఎముకలు విరిచినంత బాధ కలిగిస్తోంది. ఇంతటి ఆధ్యాత్మిక సంపత్తు క్రీస్తులో ఉంటే లేనిపోని అపోహలతో క్రీస్తును తిరస్కరించడం సబబుకాదు.

నేను యేసుక్రీస్తును స్వకీయ రక్షకుడుగా ప్రభువుగా అంగీకరించిన రోజున యీ పద్యం నాడైరీలో రాసుకున్నాను. అదే రోజునా జందెం తీసివేశాను. ఉపనయం రోజున నేర్చుకున్న సంధ్యావందనానికి స్వప్తి చెప్పాను.

**"నాదు యజ్ఞోపవీతమే నీదు సిలువ**
**ఆత్మ విప్లవ గీత మనర్గళంబు**
**నాకు సంధ్యాస్తుతి వందనంబు దేవ !"**

ఇప్పుడు నాకు 78 సంవత్సరాల వయస్సు వచ్చింది. నా జీవితంలో మొదటి 30 సంవత్సరాలు క్రీస్తు పూర్వం; రెండో భాగం నా జీవితంలో క్రీస్తు శకం, మావంశంలో క్రీస్తు శకం నాతోనే మొదలైందనిపిస్తోంది.

ఒకసారి మా బంధువుల్లో ఒకాయన "ఒరేయ్, హిందూ మతం ఎందుకురా వదిలావు ! అందులో ఏదయినా లోపం వుందనుకుంటే నీకు చేతనయితే సంస్కరించి మార్చు" దానికి జవాబు "నేను మార్చగలిగింది నాకెందుకు? నన్ను మార్చే క్రీస్తు నాకు కావాలి."

ఆతేమ నింపుదల పదే పదే నా సేవా! జీవితంలో నాకు విజయ పరంపరలను చేకూర్చింది. 10 సంవత్సరాలు నేను రేడియోలో అవిరళ కృషి చేసి సువార్త ప్రకటించాను. పరలోకం రాను రాను బహు సమీపమనిపిస్తోంది. ఏన్నో పాటలు రాశాను. ఆదికాండం మొదలుకొని ప్రకటన గ్రంథం వరకు ఒక్క వచనం కూడా విడువకుండా దేవుని సంకల్పం ఉన్నది ఉన్నట్టు బోధించాను. దూషణభూషణ తిరిస్కారాదులను ప్రజల వద్ద నుండి పొందాను. కొన్నింటిని నేనెన్నడూ సరకు చేయలేదు. ఎన్నెనో ప్రాంతాలు పర్యటించాను. కొన్ని చోట్ల అవమానానికి గురయ్యాను. క్రీస్తు పాదాల చెంత నిరాడంబరంగా జీవించటం నేర్చుకుంటున్నాను. ఇహ లోకంలో యేసు తప్ప నా కేమీ అక్కర్లేదు. ఆకాశంలో ఆయన తప్ప మరెవరున్నారు? యుద్ధ రంగంలో పోరాడి ప్రభువిచ్చిన బలాన్ని బలహీనతలో బయలు పర్చడానికి ప్రయత్నించాను.

దేవుడు మా సేవను ఎంతగానో ఆశీర్వదించాడు. రెండు సంవత్సరాలు క్రితం మా అక్కగారు తన జీవిత చరమ దశలో ప్రభువుకు నమస్కరించి పరమపదించింది. మా బంధువుల రక్షణకోసం అహర్నిశలు పట్టువిడువక

ప్రార్థిస్తున్నాము. దేవుని కృప మా పట్ల ఎంతగానో విస్తరించింది. రేడియో సేవకు ప్రతిస్పందనగా గుంటూరు, కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాలలోని కొన్ని సంఘాలు ఏర్పడ్డాయి. మిషనెరీ సాహచర్యంలో ఆధ్యాత్మిక, మానసిక తృప్తిపొందాను. కాని కొందరు మిషనెరీల వల్ల చివరి దినాల్లో భేదాభిప్రాయాలు వచ్చాయి. మొదటనుంచి పాశ్చాత్య ద్రవాన్ని ఉచ్ఛిష్టింగా భావించాను. అదేదీక్ష తుదివరకూ దేవుని కృపచేత కొనసాగింది. అన్ని క్రైస్తవ శాఖలతో అరమరికలు లేకుండా ప్రేమ పూర్వకమైన సహవాసం అనుభావించాను. క్రైస్తవ ప్రేమను ఎంతో ఎక్కువగా చవి చూచాను. ఇప్పుడు నా వయస్సు 78 ఏండ్లు, దేవుని కృపను పుణికి పుచ్చుకున్న నిండు దనం నాలో ఉంది.

లివింగ్ బైబిలు వారి ఆధ్వర్యంలో “పరిశుద్ధ బైబిలు'' అనువాదానికి దేవుడు నన్ను సాధనంగా వినియోగించుకున్నాడు. ప్రస్తుతం న్యూ ఇంటర్నేషనల్ వర్షన్ అనువాదంలో నిమగ్నమై ఉన్నాను. ఈ మహోద్యమంలో నేను ఒక భాగం కావటం ప్రభువు కృపా విశేషమే ! దేవుడు ఏ విషయంలోనూ నాకు తక్కువ చేయలేదు. గుంటూరు పట్టణంలో నాస్వంత జిల్లా కేంద్రంలో దేవుడు తన సేవలో మమ్ముల్నెంతో హెచ్చించాడు. ప్రవక్తదేశంలో ఘనత పొందదని ఉంది. కాని దేవుడు మమ్ములను తన సేవలో గుంటూరులో ఎంతో హెచ్చించాడు. ఎందరెందరికో బాప్తీస్మాలిచ్చాను. పెండ్లిండ్లు చేయించాను. కర్నూలులో ఉండగా మేము పొందిన అనుభవవాలు మరపురానివి. దావీదురాజు తాను మొదట పోగొట్టుకున్నదంతా తిరిగి సంపాదించుకున్నట్లు నేను అప్పుడు పోగొట్టుకున్న నా బంధువుల్ని తిరిగి సంపాదించుకునే దశాబ్దంలో ఇప్పుడున్నాడు. దేవునికి స్తోత్రం.

నా స్వహస్తంతో కొన్నివేల ఉత్తరాలు రాశాను. రాస్తున్నాను. సమస్యాత్మకమైన పరిస్థితుల్లో కొందరు దాపరికం లేకుండా నాకు తమ హృదయాలు కుమ్మరించు కుంటూ రాసిన ఉత్తరాలున్నాయి. ప్రార్థించి, వారికి నేను రాసిన ఉత్తరాలున్నాయి. ప్రార్థించి, వారికి నేను రాసిన ఉత్తరాలు ఆత్మశాంతికి, స్థిరతకు బాసటయ్యాయి. ఒక హెడ్మాస్టరుగారు నేను రాసిన ఉత్తరాలు బైండు చేయించుకుని పదేపదే చదువుకుంటు జీవితంలో చిట్ట చివరి ఘడియల్లో ప్రభువును అంగీకరించాడు. కొందరిని ఆత్మహత్య ప్రయత్నం నుంచి ఈ ఉత్తరాలు తప్పించాయి. దేవునికి స్తోత్రం.

స్పందన మానపత్రిక ప్రస్తుతం ఉన్న క్రైస్తవ పత్రికల్లో తలమానికమైంది. 9వేల సర్క్యులేషన్ కలిగిన పత్రిక, దేవుడెంతో ఆశీర్వదించాడు. ప్రతినెల పత్రికకోసం పాఠకులు తహతహ చెందుతూ ఎదురు చూస్తుంటారు. గ్రంథ రచనలోను గేయరచనలోను ప్రభువు నన్నెంతో ఆశీర్వదించాడు. నేను ప్రభువు ప్రేరణలో రాసిన పాటలు అశేష తెలుగు ప్రజల మధ్య విశేషాదరణ మన్ననపొందాయి. అనేక గ్రంథాలు రాశాను. అవన్నీ ప్రచురించటం జరిగింది. ఆ సేవా విధానాలన్నిటిలో నాకు తోడైయున్న సోదరీ సోదరులెందరో ఉన్నారు. విశేషించి నా సతీమణి యిచ్చిన ప్రోత్సాహం మాటల్లో చెప్పతరంకాదు. నెలకు 25 రోజుల పర్యటనలో ఉన్నా ఆమె ఎంతో ఓర్పుతో కుటుంబాన్ని నిర్వహించింది. కేసెట్లు విడుదల చేయాలని ప్రార్థిస్తున్నాము.

నా జీవితంలో ఎన్నెన్నో అపజయాలు గూడా చూచాను. నా కున్న బలహీనతలు నన్ను ప్రేమించే వారికి తెలుసు. వారి నడిగి తెలుసుకోండి. అయితే వారు మీకు చెబుతారో చెప్పరో! సులభంగా మోసగించబడటం నా బలహీనత. ప్రతిచోటికి వెళ్ళానే విశేషాసక్తితో చాలచోట్లకు వెళ్ళలేక పోయాను. ప్రభువును ప్రేమించని వారి పట్ల కఠినంగా ప్రవర్తించి, అపార్థాలకు గురి అయ్యాను. లౌకిక విధానాలు తెలియక, కొందరికి గర్విష్టిగా కనబడ్డాను. అయితే నా మనస్సెరిగిన ప్రియులు ఎందరెందరో ఉన్నారు. వారికి నా కృతజ్ఞతలు.

ఫిబ్రవరి 29 నా జన్మదిన సందర్భంలో మాసిలామణి గారిచ్చిన సందేశం మరిచిపోలేను. “క్రీస్తు నందు ఈయన తన అడ్రస్సు పోగొట్టుకున్నాడు. తన పూర్వకులమేదో ఎక్కడో అవసరమైతే తప్ప ఎప్పుడో ప్రాస్తవించలేదు. రాయటానికి కూర్చుంటే ఎత్తిన కలం దించరు. తనేమై ఉన్నాడో యితరులు యిట్టే గ్రహించలేరు, జాగ్రత్తగా పరిశీలిస్తేనే గాని, ఈయన అర్థం కాదు” ఆయన నన్ను బాగా ఎరిగిన మంచి ఫాదరులు. అలాగే ఇప్పుడున్న క్రైస్తవ నాయకులందరూ నన్నెంతో ప్రేమిస్తారు.

**(సశేషం)**

**మీ జీవితానికో అద్భుతం అవసరమా?**

అలాగైతే గుంటూరు, కన్నవారు 4వ లైన్లోని ఎల్షద్దాయ్‌చర్చిలో

**ప్రతినెల రెండవ శనివారం రాత్రి 10గంటల నుండి ఉదయం 5 గంటల వరకు**

ప్రజలందరికీ **జరిగే సంపూర్ణరాత్రి ప్రార్థనారాధన** లో ఆహ్వానం

బంధుమిత్ర సమేతంగా పాల్గొని దైవాశీస్సులు పొందండి.

అంతర్జాతీయ సువార్తికులు, అద్భుతఘడియ T.V.కార్యక్రమ సందేశకులు (9 నిమిషాలు గుండె ఆగి మృతిచెంది యేసుప్రభుని కృపవలన సజీవులైన) **బిషప్ డా॥ శాంతవర్థన్ గారు** దైవ సందేశమిచ్చి ప్రతిఒక్కరికి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు.

గమనిక: గుంటూరు, ఎల్షద్దాయ్‌చర్చిలో ప్రతి ఆదివారం ఆరాధన ఉదయం 11-00 గంటల నుండి మధ్యాహ్నం 2-00 గం॥ల వరకు

ప్రతి మూడవ శనివారం సా॥ 6 గం॥ల నుండి రాత్రి 10గం॥ల వరకు విజయవాడ, ప్రభోధబుక్‌సెంటర్, C.S.i ఆడిటోరియంలో వీరిచే మహిమాన్వితసభ జరిగించబడును.

ప్రతి సోమవారం ఉదయం **గం. 6-30 ని.లకు "అద్భుతఘడియ"** T.V కార్యక్రమం '**శుభవార్త**' T.V ఛానల్లో వెలువడును.

అత్యవసరప్రార్థనాఅక్కరలకుఫోన్(0863)2354536, సెల్:09848113886

Email:santhavardhan@yahoo.com.

Web:www.goodnewsmessengers.org.in



**FOR FREE CORRESPONDENCE COURSES WRITE TODAY**

ABUNDANT LIFE STUDIES, P.O. BOX-318, GUNTUR-522004 (CELL:9959952838)

Website:www.abundantlifestudies.org.in

**సమృద్ధి జీవం అధ్యయనాలు**

(ఇంగ్లీష్, తెలుగు భాషలలో)

ఉచిత కరస్పాండెన్స్ కోర్సుల నిమిత్తం నేడే మాకు వ్రాయండి.

మా అడ్రస్: అబండెంట్ లైఫ్ స్టడీస్, పోస్ట్‌బాక్స్-318, గుంటూరు-522004 (ఫోన్:9959952838)



**మీ వీడియో, ఆడియో అక్కరలకై సంప్రదించండి**

**జేకి డిజిటల్స్**

1/2 సూర్యటవర్స్(బెంజిసర్కిల్ వద్ద)
నారాచంద్రబాబునాయుడు కాలనీ
విజయవాడ-520010
(ఫోన్:9849819094)

**For your**
**VIDEO & AUDIO**
**NEEDS VISIT**
**JAKIE DIGITALS,**
**VIJAYAWADA-520010**


# సువార్తలేని కరువు ప్రాంతములు

**10 గ్రామములకు ఒక్క సువార్తికుడు, సంఘకాపరి కూడా లేని సువార్త కరువు ప్రాంతముల విషయములో ఆత్మల భారము కలిగిన సువార్తికులు, సంఘకాపరులు, మిషన్ ఆర్గనైజేషన్స్ మమ్ములను సంప్రదించినచో పై ప్రాంతముల వివరములు తెలియజేసేదము.**




క్విజ్ 62

# ఫిబ్రవరి నెల ప్రశ్నలు

పాఠకులను వాక్యపు జ్ఞానంలో పెంచటమే ఈ శీర్షిక ఉద్దేశ్యం.

**యోబు 32 : నుండి 42 వరకు**

**1. సృష్టిలో అన్ని జీవులకంటే తెలివైనవారు మనుష్యులని చెప్పినది ఎవరు?**

**2. మేఘములకు దేవుడు ఇచ్చిన పని ఏమి?**

**ఈ నెల పోషకులు :**

| | | |
|---|---|---|
| శ్రీమతి. కె. రత్నకుమారి.హానోక్ | ఇబ్రాహీపట్నం | 3000 |
| శ్రీమతి. డా॥ సుగుణమ్మ | పులివెందుల | 2000 |
| శ్రీ. తిరుమల వెంకట్రావు | గుంటూరు | 2000 |
| బిషప్.డాక్టర్.ఎమ్.ఎస్.శాంతవర్ధన్, | గుంటూరు | 1000 |
| శ్రీ యడవల్లి ప్రసాదరావు | వరంగల్ | 1000 |
| డా ॥ హూస్సేనయ్య | బేస్తవారిపేట | 1000 |
| శ్రీమతి.యమ్.ఎ. రేచల్ | అనంతపూర్ | 1000 |
| శ్రీ జడ్ సి. దేవదానం | కర్నూలు | 1000 |
| అపో॥ ఎబినేజరు | హైదరాబాదు | 500 |
| శ్రీమతి.జి. అన్నమ్మ డానియేలు. | నర్సరావుపేట | 500 |
| కుమారి. జి. సౌజన్య | నర్సరావుపేట | 500 |
| శ్రీ. డి. ఎ. శర్మ | పొన్నూరు | 500 |
| శ్రీమతి. రమదేవి | పందిళ్ళపల్లి | 500 |
| శ్రీమతి. కూచిపూడి సౌభాగ్యం | ఒంగోలు | 500 |
| శ్రీమతి. నాగేశ్వరి. భాస్కర్ | హైదరాబాదు | 500 |
| శ్రీ. దయాభరణం. ఆనందరావు | గుంటూరు | 300 |
| శ్రీమతి. సుశీల | ఒంగోలు | 300 |
| కుమారి. జయశీలిని | ఒంగోలు | 200 |

**జనవరి నెల ప్రశ్నలకు జవాబులు:**

**1. సృష్టికర్తకాక సృష్టిని పూజింపని యోబు సాక్ష్యము ఏమి?**

జవాబు : సూర్యుడు ప్రకాశించినప్పుడు, చంద్రుడు మిక్కిలి కాంతి కలిగి నడచుచుండగా హృదయము రహస్యముగా ప్రేరేపింపబడి వారితట్టు చూచి నా నోరు ముద్దుపెట్టినయెడల పరమునన్నున్న దేవుని దృష్టికి వేషధారి నవుదును. **(యోబు 31:26,27,)**

**2. ప్రభువు ఏ ప్రాంతమును విశాలపరచి కార్యములు జరిగించును?**

జవాబు : శూన్యమండలముపైని ఉత్తర దిక్కునున్న ఆకాశ విశాలమును ఆయన పరచెను. **(యోబు 26:7.)**

**జవాబులు వ్రాసిన వారు :**

**బత్తుల ఆనీమేరి, (హైదరాబాదు)**
**శ్రీమతి జి. అన్నమ్మ డానియేల్, (నర్సరావుపేట)**
**శ్రీమతి. సంపూర్ణ సాల్మన్, (నర్సారావుపేట)**
**శాంతాగ్రేస్, (మచిలిపట్నం)**
**పాల్వాయి ధర్మేష్, (కెసముద్రం)**

| | | |
|---|---|---|
| శ్రీమతి.చోరగుడి కనికరమ్మ | విజయవాడ | 200 |
| శ్రీ సాల్మన్ రాజు | నర్సరావుపేట | 200 |
| శ్రీమతి. రమ్మలత | గుంటూరు | 200 |
| శ్రీమతి. చంద్రకళ బోయోజు | ఒంగోలు | 200 |
| శ్రీమతి. శారా అబ్రహాము | కాకినాడ | 200 |
| శ్రీ. జంగాల ఆనందం | ఒంగోలు | 200 |
| శ్రీ. బ్రదర్. యేసుదాస్ | పేర్నమిట్ట | 200 |
| శ్రీ. లూక్ ఆనంద్ | ఒంగోలు | 150 |
| శ్రీ. తెంటు శేఖర్ | విజయవాడ | 150 |
| శ్రీమతి. శ్రీదేవి | భీమునిపట్నం | 150 |

పెద్ద కథ

# విశ్వాసంలో మరో మెట్టు

5

1965లో తండ్రితో కలసి జీవించేటప్పుడు - ఆఫీసు నడిపేది సామ్యేలే. అప్పటి నుండి సామ్యేలు ఆఫీసులో పనిచెయ్యటానికి వచ్చిన వారంతా పట్టుమని పదినెలలు సామ్యేలు దగ్గర పనిచేయ్యనేదు. కారణం? సామ్యేలు దగ్గర పనికి చేరినవారందరికి గవర్నమెంటు ఉద్యోగం వెతుక్కుంటు వస్తుంది.

1997లో అమ్మాజీయమ్మ - అనే క్రైస్తవురాలి భర్త ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవణా సంస్థలో పనిచేస్తూ ముగ్గురు పిల్లలను భార్యను వదలి ప్రభువు దగ్గరకు వెళ్ళాడు. ఆయన పేరు తేళ్ళ సత్యప్రసాద్ - సత్యప్రసాద్ అన్న కుమారుడు జాన్‌విక్టర్ ద్వారా అమ్మాజియమ్మ సామ్యేలు ఆఫీసులో చేరింది. చేరిన ఆరునెలలలోనే ఆమెకు ఆర్‌టిసి నుండి కండక్టర్ ఉద్యోగానికి అప్లికేషన్ పెట్టుకోమని కాగితాలు వచ్చాయి. ఆ కాగితాలు సామ్యేలుకి ఇచ్చింది - ఇంకేం అప్లికేషన్ పెట్టండి అన్నాడు. ఆ రోజులలో లేడి కండక్టర్స్ చాల తక్కువ మంది లేక అసలు లేరని చెప్పవచ్చు ఆమె అందుకు ఒప్పుకోలేదు. ఆడవాళ్ళు కండక్టర్ పని ఎలాచేస్తారు అదీకాక నాకు టైపిస్టు పని ఇస్తామని నాతో పరిక్ష వ్రాయించారు. నేను పాస్ అయ్యాను ఇప్పుడు కండక్టర్ పని ఇస్తామంటున్నారు అన్నది. కండక్టర్ పని చేస్తుంటే అందరు ఎగతాళి చేస్తారు అన్నది. సామ్యేలు ఆమెను ఒప్పించి అప్లికేషన్ పెట్టించి ఇంకా ఎన్నో ఇబ్బందులు ఎదురైనా అవన్నీ సరిచేసి ఉద్యోగంలో చేర్పించాడు. తర్వాత రోజుల్లో ఆమె కనబడినప్పుడు జీవితంలో ఓ కుటుంబము సుఖంగా జీవించాటానికి తనను దేవుడు వాడుకొన్నాడు. అనే తృప్తి గుండెనిండుగా ఉంటుంది. అటువంటిదే మరోకటి.

1972లో ఓ హాస్టల్ కుర్రాడు టి. సాల్మన్ రాత్రి ఎనిమిదిగంటలకు సైకిల్ మీద బజారు వెళ్ళి చాల సేపటిదాక రాలేదు అసహనంగా సామ్యేలు రోడ్డుమీద వేచిఉన్నాడు. సాల్మన్ సైకిల్‌ని నడిపించుకుంటు వస్తున్నాడు కుడికంటి మీద అంగుళం లోతులో చర్మం విప్పారింది. అతని చొక్కఅంతా రక్తం రాళ్ళకుప్పమీద పడ్డాను అన్నాడు. ఓ రిక్షా మాట్లాడి ఎవరినయినా తోడిచ్చి గవర్నమెంటు ఆసుప్రతికి పంపించ వచ్చును. కాని సామ్యేలు తన క్రొత్త కారు బయటికి తీసి సాల్మన్ని ఎక్కించుకొని తన స్నేహితుడైన డాక్టర్ కమలాకర్ వద్దకు తీసికొన్ని వెళ్తే ఆయన అతినైపుణ్యంగా కంటిపై చర్మం కుట్లు వేశాడు. తర్వాత కాలంలో ఆ సాల్మన్ ఎదురొస్తే కనీసం గాయం మచ్చకూడా కనిపించలేదు. ఆ రోజు కారు బయటికి తీసి హాస్పటల్‌కు స్వయంగా తీసుకొని పోకపోతే కంటిమీద అంగుళం నల్లని మచ్చ ఇప్పటికి ఉండి ఉండేది.

మనం మేలు చేసినవారు ఆ మేలును మరచిపోయినా మనం చేసిన మేలు వలన ఒకరు బాగున్నారు అనే తృప్తి. ఎంతగొప్పది - అయితే మేలు పొందినవారు మనకు ఏమి ప్రతిఫలం ఇవ్వకపోయినా కనీసం చేసిన మేలును గుర్తు పెట్టుకోవాలని మనం కోరుకుంటే మనకు వ్యసనమే మిగులుతుంది. కాబట్టి జీవితంలో ఎవరికి మేలుచేసినా మనం మరచిపోవాలి - మనకు మేలు చేసినవారిని మనం మరచి పోకుండా ఉండేటట్లు మనం జాగ్రత్తపడితే చాలు.

ఇది మానవ జీవితం - ఏ దేశమయిన, ఏ జాతిఅయినా, ఏ కులంఅయినా, ఏ మతమయినా ఒకటే.

▪ ▪ ▪

సికింద్రబాద్ అదెయ్యనగరం నుండి ఉత్తరం వ్రాసిన దేవదానంగారిని ఒరోజు చూడవెళ్ళాడు. 160 నెంబర్లు వెదకి వెదకి లోనికి వెళ్తే దేవదానంగారు 85 సంవత్సరాలయినా చురుకుగానే ఉన్నారు. ఎవరు అంటే "కొడవటికంటి" అని జవాబిచ్చాడు సామ్యేలు కాని ప్రక్కనున్న వ్యక్తి ఆయనకు అసలు వినబడదండి అన్నాడు. అప్పుడు సామ్యేలు తన అరచేతిమీద పెన్నుతో 'ఆసెనతు'

అని పెద్ద అక్షరాలు వ్రాసి ఆయనకు చూపించాడు. వెంటనే ఆయన లేచి వచ్చి సామ్యేలును కౌగలించుకున్నాడు. ఆయన పెద్ద కుమార్తె గ్రేష్‌ప్రత్యూష రిటరైన కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసరు అక్కడే ఉన్నది. మీకు జప్నత్పనేహు పుస్తకం ఎలా వచ్చింది అన్నాడు సామ్యేలు నాకు తెలియదు ఆ పుస్తకం నా మంచంమీద ఉంటే చదివి ఆసెనతు కోసం తిరిగాను అన్నారు.

అప్పటినుండి దేవదానంగారికి సామ్యేలుకు మధ్య ఉత్తరాలు నడుస్తున్నవి. ఓ ఉత్తరంలో ఆయన రెండవ కుమారుడు చనిపోయాడని వ్రాశాడు. మానవుడు అరవై సంవత్సరాల కంటే ఎక్కువ కాలం జీవిస్తే వినేవన్నీ చావులే యవనం దాటే వరకు స్నేహాలు ఎక్కువవుతుంటే తర్వాత మనల్ని విడిచిపోయే వారు మరణించేవారు ఎక్కువ మంది ఉంటారు. ఇది మానవ జీవితం.

ఓ సాయంకాలం ఆఫీసు నుండి – మెయిన్‌రోడ్డు మీదకు వస్తుంటే ముగ్గురు యవ్వనస్తులు సామ్యేలుకు ఎదురయ్యారు. సామ్యేలు రోడ్డుమీద నిలబడి గాలిపీల్చుకొని వెనక్కిచూస్తే ఆ ముగ్గురు సామ్యేలు తమ్ముడు జోసఫ్‌తో మాట్లాడుతూ సామ్యేలు దగ్గరకు వస్తున్నారు. ఎవరుకావాలి అన్నాడు. మీరు – కొడవటికంటి గారా అన్నాడు. ఆ పేరుతో పలకరించటం క్రొత్తగాను సంతోషంగాను ఉన్నది సామ్యేలుకు. 'ఆసెనతు' కొరకు వచ్చాను అన్నాడు. ఎక్కడనుండి అన్నాడు సామ్యేలు. కావలి నుండి అన్నాడు అంటే 60 కిలోమీటార్ల దూరం. మీకు జప్నత్పనేహు ఎక్కడిది అన్నాడు సామ్యేలు. మా ఇంట్లో ఉన్నది చదివాను అన్నాడు. మీ ఇల్లు కావలి రైల్వేస్టేషన్‌కు దగ్గర జనతాపేటలోనా అన్నాడు. ఔను అన్నాడు, ఆయనపేరు స్టాలిన్. వయస్సు 34 సం॥ ఉన్నత విద్య అభ్యసించి వివాహము లేకుండా దేవుని సేవకి సమర్పించుకొనిన యవ్వనుడు.

కొన్ని నెలలు క్రితం సామ్యేలు మద్రాసునుండి పినాకినిలో ప్రయాణం చేస్తుంటే ఓ పెద్దాయన తను రచించిన గ్రామర్ పుస్తకాలను తోటి ప్రయాణీకులకు చూపిస్తున్నాడు. సామ్యేలు ఆయనతో మాట్లాడలేదు – కావలిలో ట్రైన్ ఆగినప్పుడు ఆయన ప్లాట్‌ఫారం మీదుగా కాకుండా పట్టాలవైపుగా క్రిందకు దిగుతుంటే – సామ్యేలు తన చేతిలోని జప్నత్పనేహు ఆయనకిచ్చాడు. ఆయన ఏమి మాట్లాడకుండా గబగబ రైలుదిగి ఎదురుగా ఉండే జనతాపేటలోనికి వెళ్ళడం చూసాడు. ఆ పుస్తకం ఇప్పుడు స్టాలిన్ గారిని ఇక్కడికి నడిపించింది. 'ఆసెనతు' వెల 30రూ ఇచ్చి పుస్తకం కొనుక్కుని వెళ్ళిపోయాడు.

తర్వాత ఒకనెలకి స్టాలిన్‌గారు మరలా సామ్యేలుగారి దగ్గరకు వచ్చాడు. ఏ సార్ బాగున్నారా అన్నాడు సామ్యేలు. "ఆసెనతు" పది పుస్తకాలు కావాలి అన్నాడు స్టాలిన్. మీకు బుక్‌షాపు ఉన్నదా? అన్నాడు సామ్యేలు – లేదండి అన్నాడు. మరి పదిపుస్తకాలు ఎందుకు అన్నాడు సామ్యేలు – ఈ పుస్తకాలు చదివిస్తే ప్రసంగము చేసినట్లే అన్నాడు స్టాలిన్. అట్లయితే పుస్తకం ఇరవై రూపాయలకే ఇస్తాను అన్నాడు సామ్యేలు.

రెండు నెలలు తర్వాత స్టాలిన్‌గారు ఓ రాత్రి 9 గంటలకు ఒంగోలు వచ్చాడు. మీ రచనలు ఇంగ్లీషులో ఉన్నవా? అన్నాడు – లేవండి ఎందుకు అన్నాడు సామ్యేలు. నేను సేవనిమిత్తం పంజాబు వెళ్తున్నాను మీ రచనలు తీసికొని వెళ్ళాలని అన్నాడు.

మీరు ఇంగ్లీషులో తర్జుమాచేసికొని ప్రింటింగ్ చేయించుకోండి – మీకు సర్వహక్కులు రాసిస్తాను అన్నాడు సామ్యేలు – స్టాలిన్‌గారు నిరాశగా వెళ్ళాడు.

ఇప్పటికి సామ్యేలు ఆసెనతు పుస్తకాన్ని – తాను రచించినదే అయినా ఎనిమిదిసార్లు చదివాడు. అపోస్తులుడు పుస్తకం ప్రింటింగ్ కొరకు ఒ పాత స్నేహితుడు ప్రింటింగ్ ప్రెస్ యజమానిని కలిసాడు – ఆప్రెస్‌ను ఇక మూసివెయ్యాలని అనుకొంటున్నాడు. రోజుకు నాలుగు పేజీలు ప్రింటు చేస్తానన్నాడు. పుస్తకం బైడింగ్ ఏరోజు కారోజు సామ్యేలు ఇంటివద్ద చేసుకోనేవాడు. పుస్తకం పూర్తయిన తర్వాత చదవటానికి వీలులేనంత భయంక రముగా ఉన్నది ఆ ప్రింటింగ్ అక్షరాలు. అయినా నాలుగో పుస్తకం బయటికి వచ్చింది – అనే సంతోషము సామ్యేలుకు కలిగింది.

(సశేషం)

**సాక్ష్యము**

# క్రీస్తుదాసు

**సూళ్ళూరు పేట.**

రైల్వే కోడూరు వాస్తవ్యులు గంగమ్మ, గంగయ్య నా తల్లిదండ్రులు వ్యవసాయకూలిగా పనిచేసేవారు. మేము ముగ్గురం. నాకు అన్న చెల్లి ఉన్నారు – మా తల్లిదండ్రులు ఈశ్వరుని పూజించేవారు.

నా పేరు క్రిష్ణయ్య, చిన్న తనములో మా ఊరి ఎలిమెంటరీ స్కూలులో మాత్రమే చదువుకొన్నాను. మా తల్లిదండ్రుల మధ్యలో వివాదము ఏర్పడి మా అమ్మ వాళ్ళ ఊరికి వెళ్ళిపోయింది. మేము మా తండ్రి దగ్గరే ఉన్నాము. 10సం॥ వయస్సులో ఓ టీ కొట్లో పనిచెయ్యటానికి కుదిరాను. నా అంత వయస్సున్న పిల్లలతో నాలాంటి వారితో తిరుగుతు ఇంటికి వచ్చేవాడిని కాను. తిరుపతి స్టేషన్‌లో పండుకొనేవాడిని. చిన్న వయస్సులోనే సిగిరేట్లు తాగటం, బూతులు మాట్లాడటం నేర్చుకున్నాను.

15 సంవత్సరము వయస్సులో త్రాగుడు, గుట్కా అలవాటు చేసుకొన్నాను. టీ కొట్లో పనిమాని రిక్షా వేసేవాడిని మొదట్లో డబ్బులు బాగా ఉంటే బ్రాంది తాగేవాడిని లేనప్పుడు చిన్నచిన్న దొంగతానాలు చేసేవాడిని. 20 సంవత్సరాల వయస్సులో పేకాట పిచ్చి బాగా పట్టింది. పెద్ద దొంగతనాలు ప్రారంభించాను. నా చుట్టుప్రక్కల ఉండే వారికి నేనేమయింది తెలియనిచ్చేవాడిని కాదు. ఓరోజు దొంగతనం చేసి పోలీసులకు చిక్కాను – అప్పటినుండి పోలీసు వారి జాబితాలో చేరాను. అప్పుడప్పుడు జైలులో ఉండేవాడిని.

నా రిక్షా ఎక్కిన మనుషులను చూసి అటువంటి మర్యాదయిన జీవితం దేవుడు నాకెందుకు ఇవ్వలేదు. అందరిలాగ నేను కూడ తల్లిదండ్రుల ప్రేమలో పెరుగలేక పోయినందున వ్యధ చెందాను. దేవుడు ఒక్కడే అంటారు. కాని ఈ తిరుపతి దేవుడు కాక అన్ని ఊర్లలో ఊరికి ఒక్క దేవుడు ఉన్నప్పుడు ఆ దేవుళ్ళుకూడ మనుషుల్లాగనే తన్నుకొన్నారు కొట్టుకొన్నారు. ఒక్కొక్కరు ఇద్దరు ముగ్గురు భార్యలను చేసుకొన్నారు. ఇంక వారి గొప్ప ఏమిటి? అని నిరాశపడి పోయేవాడిని.

నేనున్న స్థితిలో నుండి ఎప్పుడు పైకి రాలేనా? అనుకొనేవాడిని – దొంగతనము చేసిన డబ్బు ఖర్చు చేసేటప్పుడు అమితమైన వేదన కలిగేది. ఆ డబ్బులు పోగొట్టుకొనిన వారు ఎంత బాధ పడుతున్నారో అనుకొనే వాడిని ఇక దొంగతనాలు చెయ్యకూడదు అనుకొనేవాడిని. అయితే ఈ పిచ్చిజనం రోజు బస్సుల్లో రైళ్ళలో ఈ ఊరు వస్తుంటారు? ఈ ఊర్లోనే పుట్టిపెరిగిన నాకు లేని పుణ్యం వీరికెలా వస్తుంది? అనుకొనేవాడిని.

నాకు అన్న ఉన్నాడు వాడికి కాపురం ఉంది. చెల్లెలు ఉన్నది. సుఖంగా ఉన్నది.

ఓ రోజు మా అన్న నాగులయ్యా నన్ను వెతుక్కొంటూ వచ్చాడు. కాసిని డబ్బులు తెచ్చాడు రైల్వే కోడూరు నాతో రా నీకు పెండ్లి చేస్తాను అన్నాడు.

■ ■ ■

కాళహస్తికి 12 కిలోమీటర్ల దూరంలో బండారు పల్లె గ్రామంలో తాండంచెట్టి లక్ష్మయ్య ,లక్ష్మమ్మగారికి ఇద్దరు మొగ్గ పిల్లలు ఒక ఆడపిల్ల .క్రిష్ణవేణితో నాకు వివాహము చేసారు. కోడూరులోనే కాపురం – మా అన్నగారింటిలో ఉండేవాడిని, రౌడి విచ్చలవిడి జీవితం నేను రిక్షా వేస్తూనే అడపాదడపా దొంగతనాలు చేస్తూ ఉండే వాడిని నా సంగతి చాల గోప్యంగా ఉంచాను. కొంత కాలానికి నాకు పిల్లలు కలిగారు పెద్దవాడు శ్రీనివాసులు, అమ్మాయి వెంకటరత్నం, అబ్బాయి వెంకటరమణ

మా వదినకి నాభార్యకు తగాదాలు ప్రారంభ మయినాయి – మేము విడిపోయాము. అన్న ఒక్కడికె స్థిర సంపాదన నాకు ఓ ప్లాటు స్థలం ఇప్పించాడు. చిన్న గుడిసె కట్టాను.

మా అన్నతో విడిపోయిన తర్వాత నేను ఇంటికి సరిగా వచ్చేవాడిని కాను దగ్గరలో ఉన్న వెంకటేశ్వర స్వామిని గట్టిగా కొలవాలని అనుకొనేవాడిని నా దగ్గర డబ్బులు లేవు కాబట్టి ఇంటికి సరిగా వెళ్ళకుండా ఎప్పుడు దేవుని గురించిన ఆలోచనలు చివరికి నా కుమార్తెను భుజాలమీద కూర్చుండబెట్టుకొని నడచుకొంటూ కొండ ఎక్కి తిరుమల

వెళ్ళాను. తరువాత ఇంతకు ముందున్న నా జీవితాన్ని మార్చుకొని ఇంట్లోనే ఎక్కువ సేపు ఉండి ఉదయాన్నే పూజచేసేవాడిని తరువాత ఈశ్వరునికి పూజచెయ్యాలని పూజా గ్రంధాలు కొని పూజాలు చేసాను.

ఓ రోజు నా రిక్షలో ఒకామె ఎక్కింది. ఆమె దేవుని విషయాలు నాతో మాట్లాడటం మొదలుపెట్టింది. యేసుప్రభువు అని చెప్పింది. నేను రిక్షా తోక్కుతునే విన్నాను. ఆమె ఇంటికి తీసికొనిపోయి బైబిలు ఒకటి ఇచ్చి చదవమన్నది. చదవటం మొదలు పెట్టాను.

ఇంతలో నా భార్య విషయం నేను వినరాని మాటలు విన్నాను. మొదట్లో నేను నమ్మలేదు కాని కొన్ని విషయాలు తెలుసుకొన్నాను. ఓర్చుకోలేకపోయాను – నాలో అలజడి లేచింది. ఇంతక ముందు ఉండిన దానికంటే ఎక్కువ బాధ.

నాకు బైబిలు ఇచ్చిన ఆమె కొరకు వెదికాను – బైబిలు చదివిన దాని కంటే ఆమెతో యేసును గురించి వినాలని ఆశించాను. చర్చిలోనికి రానిస్తారో రానివ్వరో తెలియదు. మళ్ళీ బైబిలు చదవటం మొదలు పెట్టాను యెహోవా ఎవరు? యేసుక్రీస్తు ఎవరు? అర్థం కాలేదు.

ఇంట్లోని సంగతి నా గుండె కాల్చివేస్తుంది. ఆమె సంగతి నిర్ధారణగా తెలిసికొని ఆమెను కొట్టాను. వాళ్ళ అమ్మ (మా అత్త) వచ్చి నాభార్యను పిల్లలను తీసికొని పోయింది. ఇల్లు సిధిలమయిపోయింది. పిల్లల మీద దిగులయింది. అన్నం నీళ్ళు లేవు, మా అన్న దగ్గరకు వచ్చాను. మా అన్నని కాళహస్తి పంపించి నా భార్యను ఎలాగయిన తీసికొని రమ్మన్నాను.

నా భార్య వచ్చింది నేను ఎంతో కృంగి ఉంటే నా భార్య సోకులు చేసుకొంటు నన్ను లెక్కచెయ్యనట్లుగా ఉండేది. కనీసం నా మీద జాలి అయినా చూపించలేదు. మా ఇంటి చుట్టుప్రక్కల అందరు నను హేళన చేస్తున్నట్లుగా అనిపించేది. మా అత్త కూడ నా భార్య తరపునే మాట్లాడేది. నేను చనిపోవాలనుకొన్నాను. ఓ స్నేహితుడు నన్ను మాంత్రగాడి వద్దకు తీసుకొనిపోయాడు.

మంత్రగాడు నాకు నాగదోషం తగిలిందన్నాడు ఏవేవో సరుకులు తెప్పించి డబ్బులు ఖర్చుపెట్టి పూజలు చేయించారు రాళ్ళ చుట్టు ప్రదర్శనలు చేసి చేసి కాళ్ళు అరిగిపోయాయి. కాళ్ళ నొప్పులు – విపరీతమైన నొప్పులు నాకు చనిపోవాలనే కోరిక ఎక్కువైంది.

నా భార్యను చంపేయాలనుకొన్నాను నన్ను జైలులో పెడతారు. బ్రతికి ఉంటే పిల్లల గోడు చూడలేను. కనుక నేను కూడ చనిపోతే పిల్లలని దేవుడే చాకుతాడు అనుకొన్నాను.

ఓ పెద్ద కత్తి కొన్నాను. రాత్రి ఆమె నిద్రపోతుంది. ఆమెకు దిగులు చింత లేదు, ఆమె వలన నాకు నిద్రలేదు. పెద్దరాయి తీసుకొని ఎత్తి ఆమె కణిత మీద బలముగా వేసాను కత్తితో పొడిచాను – నేను ఆరు సార్లు కత్తితో నా కడుపులో పొడుచుకొన్నాను. నేత్తురు చిమ్మింది. నేను పడిపోయాను.

మధ్యాహ్నం రెండు గంటలకు గిరిపురం హాస్పటల్‌లో నాకు మెలుకువ వచ్చింది. నా కడుపుకు కుట్లు వేశారు. నా భార్య బ్రతికివుంది. ఆమెకు సెలైన్ కట్టారు. హాస్పటల్‌కు చాలా మంది వస్తున్నారు. అందరు ఆమెను చూస్తున్నారు కాని నా వైపుకు ఎవరు రాలేదు. నాకు పిచ్చి పట్టిందని అందరు చెప్పుకుంటున్నారు. నేను ఏలాగు బ్రతకను కనుక నాకు ట్రిట్‌మెంటు ఇవ్వటం లేదు. నా బెడ్ ప్రక్కన కిటికిలో గుండా కొండమీద వెంకటేశ్వర స్వామి కనిపిస్తున్నాడు. రెండు చేతులు పైకెత్తి – దేవుడా నన్ను కాపాడు అని మ్రొక్కుకున్నాను. డాక్టరు వచ్చి అందరిని చూచి మందులు రాసి నా వైపు చూడనైన చూడకుండా వెళ్ళిపోయాడు. మరలా సాయంకాలం డాక్టరు వచ్చి అలానే వెళ్ళిపోయాడు అందరికి రొట్టెపాలు ఇచ్చారు. నాకు ఇవ్వలేదు.

నేలమీద ప్రాకుతు వెళ్ళి రొట్టె అడిగాను. చీటి తెమ్మన్నారు. అక్కడే కూర్చుని ఏడ్చేను. అసలు ఏమి జరిగింది? నేను ఎలా బ్రతికాను. అంత దెబ్బ తగిలిన నా భార్య ఎలా బ్రతికింది? నాకేమి అర్థంకావటం లేదు. నేను చనిపోతాను అప్పుడు బయటపడేయండి అని డాక్టరు చెప్పాడంట.

రాత్రి ఎవరు లేనప్పుడు ఒంటినిండ గుడ్డకప్పుకొని కిటికిలో గుండా దూరి నేలమీద దేకుకుంటు కపిలతీర్ధం వరకు వచ్చి రైలు స్టేషన్‌కి వెళ్ళాను. ఓ రైలు ఎక్కాను నెల్లూరులో రైలు దిగాను నేలమీద కూర్చుని దేకుతూ

బయటకు వచ్చి పులి ఇస్తర్లు తిని పడిపోయాను. చొక్కలేదు ఓ గుడ్డ కప్పుకొన్నాను ఇన్ని జరిగినా దేవుడు ఉన్నాడు. దేవుడు నాకు కావాలి అనే భావన నాలో బలముగా ఉన్నది.

అలా 15రోజులు రోడ్ల మీద దేకుతూ – అడుక్కుంటూ తిరిగాను కడుపు మీద ఆరు కత్తి గాట్లు ఉబ్బి చీము పట్టి బిర్రుగా అయినది. ఒకబ్లేడు కొని కడుపు కుట్లుకోసాను చీము నెత్తురు జలాజలా ప్రవహించింది. అయిన దేవుడిమీద ద్యాస తగ్గలేదు – దేవుణ్ని పట్టుకోవాలి.

ఓ ఉదయం రెండు బన్నురొట్టెలు కొన్నాను రైల్వేస్టేషన్‌లో ఓ మూలకి వెళ్ళి బన్ను చించాను. అందులో నుండి రక్తము వచ్చింది. తినే ఆహారంలో రక్తము ఉంది, ఇదేదో చేతబడి తాలూకు – చచ్చిపోవాలను కొన్నాను కాబట్టి ఆ బన్ను తిన్నాను నా మనసు కుదుటపడింది.

ఒక నెల గడచింది – కడుపుమీద గాయం మానుతుంది. రైల్వేకోడూరు వచ్చాను టౌనులో ఉండి మా అన్నకి కబురుచేసాను నన్ను బ్రతికించటానికి రమ్మనలేదు. మా అన్న వచ్చాడు – అక్కడే చావకపోయావా? అన్నాడు. ఎరా! ఇంత జరిగినా మానవులలో కనికరం పుట్టదా? అనుకొన్నాను. శిక్ష పడింది కదా! ఏ దేవుడు కనికరం చూపలేదు – ఆటోలో ఇంటికి తీసుకొని వెళ్ళాడు అక్కడ ఎవరు మాట్లాడలేదు. అత్తగారింటికి పోతానన్నాను మా అన్న ఒప్పుకోలేదు.

అయిదురూపాయలు చార్జితో రేణిగుంట వచ్చి ఎడ్చిఎడ్చి ఉదయం 10 గంటలకు నిద్రపోయాను స్టేషన్‌లో ఆర్.పి.యఫ్ జవాను కర్రతో కొట్టాడు. నేను లేచి దూరంలో ముగ్గురు కుష్టరోగులు కనిపిస్తే వారి దగ్గరకు వెళ్ళి కూర్చున్నాను. వాళ్ళు ప్రార్ధన చేసికొంటున్నారు.

ఎందుకు ఏడుస్తున్నావని నన్ను అడిగారు వారికి నా సంగతంతా చెప్పి బ్రహ్మంగారి మఠం వద్దకు వెళ్ళి చావాలను కుంటున్నానని చెప్పాను.

నీ భార్యబిడ్డలు కావాలా? అన్నారు. నా కెంతో ఆదరణ కలిగింది. నీవు భయపడవద్దు – నీ భార్యపిల్లలు అందరు వస్తారు. నువ్వు నేరుగా చర్చికి వెళ్ళు అని అన్నారు.

చర్చి అంటే ఏమిటి? అన్నాను. వాళ్ళు చర్చి అంటే యేసుప్రభువు ఉండే స్థలం అక్కడికి పోయి ఏడువు అన్నారు. నాకు ఆనందం కలిగింది. క్రొత్త శక్తి వచ్చింది.

అక్కడ తెల్లని వస్త్రాలు ధరించిన ఒకామె కనిపించింది. ఆమె కాళ్ళు పట్టుకొన్నాను ఆమె వెంట నడుస్తుంటే బొట్లుబొట్లు రక్తం కనబడుతుంది. జ్యోతినగర్ రేణిగుంట చేరాను. ఆమె ఉన్న ఇంటికి చేరి నా కథ అంతా చెప్పాను. వారు నన్ను ఆదరించారు ఆహారం పెట్టారు నాలుగు నెలలు అక్కడే ఉన్నాను. పొలం ఉన్నది, మంచి ఇల్లు, బోజనము, వస్త్రం కొదువలేకుండినది. పాతనిబంధన, క్రొత్తనిబంధన మొత్తం చదివేవాడిని.

దగ్గర్లో సమాధులు చూస్తు ఏడ్చేవాడిని యేసు ప్రభువు చనిపోయినవారిని కూడ లేపినవాడు నన్ను కుష్టరోగుల దగ్గరకు పంపించి వాక్యము చెప్పించి – ప్రార్ధన చేయించిన వాడు, ఈ ఇంటి వారికి నన్ను ఆదరించటానికి మనసు కలుగజేసినవాడు ఈయన అని నమ్మాను. చర్చికి పోవాలని ఆశకలిగేది ఇంటి వారిని చర్చికి పోతానని చెప్పితే పంపించటానికి వాయిదాలు వేసేవారు. చర్చికి పంపించమని మనసులో ప్రార్ధన చేసుకొనేవాడిని, పెద్దగా ప్రార్ధన చెయ్యటం ఏమిటో నాకు తెలియదు, మనసులో అనుకొనేవాడిని.

ఒక రోజు నన్ను ఆదరించిన ఇంటివారి బంధువు ఒకామె వచ్చింది. ఆమె పేరు కూసమ్మ – ఆమె యేసు ప్రభువును నమ్ముకొని యున్నది. ఆమె నన్ను ప్రార్ధనకు తీసుకొని వెళ్ళింది. అక్కడ నాకు ఎనలేని ఆదరణ ఆనందం కలిగింది. సంఘస్థులందరు నన్ను ఆదరించారు. ఇంటిలో కాని, బంధువుల దగ్గర కాని – తల్లిదండ్రుల వద్ద కాని దొరకని ఆత్మీయత పొందాను. పాష్టరుగారు ఆదరించారు, నా కోసం ప్రార్ధన చేసారు ప్రభువులో ఎదుగుతువున్నాను.

▪ ▪ ▪

నా భార్యను తీసుకొని వచ్చి కోడూరులో కాపురం పెట్టాను. చిన్న నెట్టుడు బండిమీద పండ్ల వ్యాపారం ప్రారంభించాను. రెండుసంవత్సరములలో పండ్ల షాపు ప్రారంభించాను. అయిదారు సంవత్సరాలలో హోల్‌సెల్ వ్యాపారం చేసి 2.లక్షల రూపాయలు సంపాదించాను. ధనసంపాదన పెరిగేకొలది దేవునికి దూరమవటం ప్రారంభమయింది. ధనంతో పాటుగా – చీటిలు వెయ్యటం, పాడటం తర్వాత నేను పేకాటకు వెళ్ళకపోయినా పేకాట

ఆడించేవాడిని ఈ విధంగా ఒక్కో అడుగు ప్రతిరోజు దేవునికి దూరమయ్యాను.

అయినను ఓ చర్చికి ప్రార్ధనకు వెళ్తూ ఉండేవాడిని, బాగ కానుక ఇచ్చే వాడిని బాప్తీస్మము తీసుకొన్నాను. నా భార్య కూడ నాతో ప్రార్ధనకు వచ్చేది. కాని పూర్తిగా ధన సంపాదనలో పడిపోయి అశాంతికి గురి అయి వ్యాపారంలో నష్టాలు వచ్చి డబ్బంతా తరిగిపోయింది. ఇల్లు వాకిలి పోయాయి.

అక్కడ నుండి గూడూరులో కాపురం పెట్టాను. ఫైనాన్సులో ఆటో తీసికొని జీవించసాగాను. అక్కడ కూడ స్థిమితం పొందలేదు.

ఒకప్పుడు మనుష్యుల చేత తృణీకరింప బడినవాడిని, ఆత్మహత్యకు ప్రయత్నంచినవాడిని – అడుక్కోనే స్థితిలో దేవుడు నన్ను వదలకుండా మరలా గొప్ప స్థితికి తీసుకొని వస్తే నామకార్ద క్రైస్తవునిగా మారి శాంతిని పోగొట్టుకొన్నాను.

గూడూరు నుండి వెళ్ళిపోవాలనుకొన్నాను ప్రభువు పాదాల వద్దకు చేరాను. ప్రార్ధించాను ఉపవాస ప్రార్ధన చేసాను. నా దగ్గర డబ్బులు లేవు 200 వందల రూపాయలు మాత్రమే మిగిలాయి. ప్రభువు నన్ను ప్రేమించాడు. ఆదరించాడు, సూళ్ళూరుపేట వెళ్ళమన్నట్లుగా ప్రేరేపణ కలుగుతున్నది. నేను ఇక ఏ వ్యాపారము చెయ్యనని – నా ఆటోలో ప్రయాణం చేసేవారికి యేసయ్య ప్రేమను గురించిన నా సాక్షము చెపుతానని నిశ్చయించుకొన్నాను. చేతిలోని 200 వందలరూపాయలతో సూళ్ళూరుపేటకి నా భార్యతో కలసి వచ్చాను. నా భార్య మా ఊరికి పోదామని చెప్పుతున్నది. నాకు సూళ్ళూరుపేటలోనే నివశించాలని ప్రేరణ. చీకటి పడుతుంది. అలా తిరుగుతూ ఓ చిన్న ఇంటివద్దకు వచ్చి – అద్దెకు ఇల్లు అడిగాను వాళ్ళు అద్దె లేకుండానే ఓ చిన్న ఇల్లు ఇచ్చారు. ఇది దేవుని చిత్తమని గ్రహించి చేరాను.

ప్రతి రోజు ఆటో నడుపుతూ – దేవుని విషయాలు మాట్లాడేవాడిని – ఓరోజు "మన్నార్ పోనూర్" గ్రామమునకు "ఆనందం దేవకుమార్" గారు ఎక్కారు. ఆయన నా సాక్షము విన్నాడు – మరలా ఆయన తటస్థపడలేదు.

ఓ రోజు "శ్రీహరికోట" లో ప్రయాణికులను తీసుకొని వెళ్ళి తిరుగు ప్రయాణంలో ముగ్గురు దేవుని సేవకులు ఎక్కారు. వారు "మన్నార్పోనూర్" కి ఆటో మాట్లాడుకొన్నారు. అక్కడ వారు దేవకుమార్ గారింటికే వచ్చారు. నా మనవి ప్రభువు విన్నాడు. మరలా "దేవకుమార్" గారిని చూసాను. ఆ రోజు ఆయన దగ్గర చాలసేపు మాట్లాడాను తర్వాత చాల సార్లు ఆయనతో మాట్లాడి ప్రభువుతో స్థిరపడ్డాను.

హన్నాకృప ఎడిటర్గారికి దేవకుమార్గారు ఫోను చేసారు. ఆయన వచ్చి నా సాక్షము వ్రాసికొని నాకు చాల పుస్తకాలు ఇచ్చాడు.

నా రధికుడైన యేసుప్రభువుకు స్తోత్రములు. మీకు వందనములు.

**(సమాప్తం)**



సాక్ష్యము

# ఆయన చేసిన ఆశ్చర్య కార్యములు

**శ్రీమతి చోరగుడి కనికరమ్మ, కోలవెన్ను**

1953వ సం॥ టీచర్ ట్రైనింగ్ పూర్తయింది. 2క్లాస్‌లో పాసైనాను. అక్కడే 6వారములు అడల్ట్‌ట్రైనింగ్ ఇచ్చినారు. అది కూడ చదివి ఫస్టుక్లాస్ సర్టిఫికేట్ తెచ్చుకున్నాను. కోలవెన్నులోనే ఉద్యోగం దొరికింది. సర్వీసు రిజస్టరు ఓపెన్ చేయుటకు చలానకట్టుటకు విజయవాడ వెళ్ళాలి, నాకు తండ్రిలేరు. 5.వ. తరగతిచేదివేటప్పుడు చనిపోయారు. మా తల్లి ఇద్దరు మాష్టర్లకు చెప్పి వారివెంట విజవాడకు పంపింది.

నన్ను బోంచేసిరమ్మని వారు ముందువెళ్ళి బందరురోడ్డు దగ్గర కనిపెట్టుచున్నారు. త్వరగా వారిని కలవాలని రోడ్డు దార్నివెళ్తే ఆలస్యమౌద్దని అడ్డదారిన చేలో గుండ వెళ్తున్నాను, దూరాన ఈత పొదలోనుండి పెద్దత్రాసు తొండను పట్టుకొనుటకు తరుముతూ వస్తుంది. నాకు గజం దగ్గరకొచ్చాక దానికది దొరికింది. వెనుకకు తిరిగి వెళ్ళింది. భయంతో పరుగెత్తి వారిని కలుసుకొన్నాను. విజయవాడలో వెళ్ళిన పనైంది. ఆ మాష్టర్లు నన్ను ప్రైవేట్ బస్‌లో కూర్చుండ బెట్టి సినిమాకు వెళ్ళారు. కండక్టరు వచ్చి నన్ను దింపివేశాడు, బ్రతిమాలినను టికెట్ ఇవ్వలేదు. ప్రతి బస్‌కి కిక్కిరిసిన జనం, దూరంగా నిలవబడి ప్రార్థన చేసుకొన్నాను. ఉయ్యూరు సి.బి.యం స్కూల్‌లో నాతో 5.వ. తరగతి చదివిన యమ్. యోసేపు అనే అబ్బాయి కనబడి నన్ను పలుకరించి నాకు టిక్కెట్ తీసి అతి కష్టంగా నన్ను బస్ ఎక్కించినాడు. కంకిపాడు సినిమాహాల్ వద్ద దిగినాను. టిక్కెట్ కొని హాల్‌లోనికి వెళ్ళాను. కోలవెన్ను వారికోసం వెదకేను ఒక్కరు కనిపించలేదు. సినిమా వదిలారు బయటకు వచ్చి దూరంగ నిల్చుండి వణికిపోతున్నాను. టైం 11గం॥ అయ్యింది. బంధువులున్నారు వారి వద్ద వెళ్ళుటకు కుక్కల భయం. యేసయ్యను పిలుస్తున్నా గొంతు ఎండిపోతుంది.

బయటకు వచ్చువారిని చూస్తున్న ఇద్దరు కోలవెన్ను వారు హెర్కిన్‌లాంపు పట్టుకొని బయటకు వస్తున్నారు. నన్ను చూచారు కనికరమ్మా ఏంటి ఇక్కడ నిలబడ్డావు, జరిగిన సంగతి చెప్పాను. ఇద్దరి మధ్య నన్ను నడుపుచు ఇంటికి చేర్చినారు. వారిద్దరు క్రైస్తవులే, సంజీవరావు, యోసేపు అక్కడ టిక్కెట్ తీయుటకు యమ్. యోసేపును ఇక్కడ వీరిద్దరిని కెరూబుల్, సెరాపుల్ వలే తోడైయున్నారు. లోకమంతట సంచారము చేయుచున్న యెహోవ కన్ను భయంతో, ఒంటరినైన నన్ను తీసుకొని వచ్చుటకు మధ్యాహ్నమే ల్యాంపునిచ్చి ఇంటికి చేర్చిన యేసు నాయనకు నా హృదయపూర్వక వందనములు, స్తోత్రములు హల్లెలూయ.

మిషన్ టీచర్స్‌కు సం॥న. కొకసారి బైబిల్ పరిక్ష జరుగుతుంది. ఊయ్యూరు సి.యం. స్కూల్‌లో వ్రాయుటకు కోలవెన్ను నుండి బందరు రోడ్డు దగ్గరకు బస్ ఎక్కి ఉయ్యూరు వెళ్ళాలి. 1మైళ్ళు దూరం నడిస్తే రైస్ మిల్లు కోలవెన్ను వాసి సుందరమ్మ అనే ఆవె అక్కడే పనిచేస్తుంటుంది. 12 గంటలటైంలో రోడ్డు మీద చెట్టుక్రింద కూర్చోనుంది. ఎక్కడి కెళ్తున్నావమ్మా అని అడిగింది. ఉయ్యూరు బైబిల్ పరీక్ష కెళ్తున్నా అన్నాను. తిరిగి వచ్చేటప్పుడు చీకటి పడితే నాయొద్దకు వస్తావేమో రావద్దు ఫ్యాక్టరీలో భయంకరమైన కుక్కలున్నవి, చీల్చేస్తాయి అని అంది. కుక్కలంటే నాకు చాల భయం 4 గంటలకు పరీక్ష అయిపోయింది. బస్ ఎక్కాను. ఓగిరాలవద్ద చకింగ్ ఇన్స్‌పెక్టర్ ఎక్కినారు. అందరి టిక్కెట్లు చూచినారు. ఒకతను అరబస్తా బియ్యపు మూటవేసినాడు – మూటకు టిక్కెట్ లేదు. మూటను క్రిందకు తోసినాడు, చీకటిపడుతుందనే భయంతో ఆమూటకు పైసలు నేనిస్తానండి అన్నాను. అమ్మాయి కూర్చో అన్నాడు. అతను తన యజమాని యొద్ద బస్ దిగగానే ఇస్తానంటున్నాడు గదా! మూట వేసుకోనివ్వండి అని బస్సులోయున్నవారు బ్రతిమాల్తూ చెప్పారు. మరల మూట వేసికొన్నాడు. బస్ దిగేసరికి ఆరున్నర అయింది. సుందరమ్మ అని కేకవేశాను పలుకలేదు. చాల భయం, దిక్కులేని వారికి దేవుడే అని యేసయ్యను

పిలుస్తూ నడుస్తూన్నాను – నోరెండిపోతుంది. యేసయ్యను పిలుస్తూ నడుస్తూండగా నాకు ముందుదారిలో టార్చిలైటు పడుతుంది. ఆ దారిలో సమాధులున్నవి నాకు చాల భయంతో లైటు చూస్తు సమాధులు ఎప్పుడు దాటానో తెలియదు. ఆ లైటువెలుగులో ఇల్లు చేరినాను. నాకు వెలుగైయున్న ప్రభువుకు స్తోత్రం, హల్లెలూయ.

నా చిన్నకుమారుడు 20సం॥ల వయస్సులో ముస్లిం ఫ్రెండ్ ఒకబ్బాయి బోజనానికి పిలిచాడు. రెండవ రోజు నుండి మోషన్స్, 23 రోజులైనవి ఎన్నో మందులు వైద్యాలు చేసినాము. లేవలేని, నడువలేని స్థితి అయింది. మంచం దగ్గర మోకరించి ప్రార్ధన చేస్తున్నాను. నా చేయి నూనెరాసి ప్రార్ధన చేస్తున్నట్లు ప్రార్ధనలో చూచినాను. వెంటనే లేచి నూనె తీసికొని ప్రార్ధన చేసి పొట్టపై వ్రాసినాను. తెల్లవారు జామున జావత్రాగుతానమ్మా అన్నాడు. జావ చేసి ఇచ్చినాను. గ్లాసుడు తాగినాడు – ఉదయాన్నే ఉప్మా తింటానన్నాడు. తిన్నాడు, కాఫీత్రాగి నడచి బైటకెళ్ళి ఈజిచైర్‌లో కూర్చుండి ధ్యానమాలిక చదువుచున్నాడు. 23 రోజులు ఆహారంలేదు. మజ్జిగ మాత్రమే ప్రభువుకు స్తోత్రం.

నా పెద్ద కుమారుడు బందరు నోబుల్ కాలేజిలో బి.ఎ. చదువుచున్నాడు. దివిసీమ మునిగిపోయిన పెద్ద తుఫాను, శవాలు చెట్లకు పట్టుతున్నాయట అని చెప్పు కుంటున్నారు. ప్రభుపాదాల యొద్ద మోకరించి ప్రార్ధన చేస్తున్నాను. ప్రార్ధనలో నా కుమారుడు స్నేహితుడు హాస్టల్ పై అంతస్తులో నిలబడి బ్రతికియుంటే తల్లిని తండ్రిని చూస్తాము లేనిచో, ఇక్కడివారిలాగే అవుతాము. ఆ దేవుని దయ అనుకుంటున్నారు. వారు నాకు చాల దిగులుగా యుండి కనిపిస్తున్నారు. ఏ డ్రస్‌లో యుండి కనిపించాడో అదే డ్రస్‌తో ఇంటికి చేరినాడు. వెంటనే ప్రభుకు స్తోత్రం చెప్పిన్నాను.

నేను టీచర్‌ట్రైనింగ్ అయిన తరువాత బందరు లోనే ఆరు వారములు అడల్ట్ ట్రైనింగ్ కూడ చదివి ఫస్టుక్లాస్‌లో పాసై సర్టిఫికెట్ తెచ్చుకొన్నాను. స్కూల్ మేనేజరు గారు ఉయ్యూరు వెస్టుఫీల్డ్ నుండి నన్ను రాజమండ్రి అడల్ట్ మీటింగ్‌కు డెలిగెట్‌గా వెళ్ళమని ఎంపికచేసినారు. మా మాష్టరుగారు విజయవాడ వచ్చి నన్ను ట్రైన్ ఎక్కించి ఏలూరు తరువాత రాజమండ్రి స్టేషన్ వస్తుంది అని చెప్పినాడు. ట్రైన్‌లో ఒకే సీటు ఉన్న చోట కూర్చో మన్నారు రైలుఅధికారి. నా లగేజి దగ్గరపెట్టుకొని తలపైముసుగు వేసికొని ప్రార్ధిస్తున్నాను. నాకు ఒకరు సహాయం కావాలి, ఏలూరు అని వినబడింది. కండ్లు తెరిచాను – నాకెదురుగా ఒకరు వచ్చి కూర్చున్నారు. ఆయన జాన్‌బన్యన్ అనే పుస్తకం చదువుచున్నారు. ఆనందరావు అవనిగడ్డ అని అట్టపై ఉన్నది. ఆ పుస్తకం మా బైబిల్ పరీక్షకు నాండిటైల్, దానిలోని 30 పేజిలు చదవాలి, మీ రెక్కడికెళ్తున్నారని ఒకరికొకరం తెలుసుకొన్నాము. మాది అవనిగడ్డ రాజమండ్రి అడల్ట్ మీటింగ్‌కు డెలిగెట్‌గా వస్తున్నాను అన్నారు. తోడు దొరికినందుకు ప్రభువుకు స్తోత్రం చెప్పి రాజమండ్రి ఆల్‌కట్ తోటకు రిక్షాలలో చేరినాము. ఆనందరావుగారి అత్తగారిది కోలవెన్ను . ప్రభువుకు స్తోత్రం.

## 27వ పేజి తరువాయి భాగం

మండలాధినేత ఫాదర్ జోసఫ్ సెబాస్టియన్ గారి నేతృత్వంలో బహు సుందరంగా నిర్మాణమైంది. ఇప్పటికే భక్తుల వసతి కొరకు చక్కని ఏర్పాట్లు చేయబడ్డాయి. ప్రతి శని, ఆది వారాలలో, ప్రభుత్వ సెలవు దినాలలో శ్రీ సంజీవనాధ స్వాముల వారి పవిత్ర సమాధి వద్ద ప్రత్యేక ప్రార్ధనలు జరుపబడుతున్నాయి.

శ్రీ సంజీవనాధ స్వాముల వారి 333వ జన్మదిన సందర్భంగా ఈ సంవత్సరమంతా యాభై మంది వృద్ధులకు నిత్యాన్నదానం ఏర్పాటు చేయబడింది. కృష్ణాపురంలో సంజీవనాధ స్వాముల వారి మఠం వద్ద జూలై 24న త్రిశతాబ్ధి ఉత్సవాలు ఘనంగా జరుగనున్నాయి. మరి ఈ ఆంధ్ర శ్రీసభ త్రిశతాబ్ధి ఉత్సవాలలో విశ్వాసంతో పాల్గొని ఆ పుణ్యగురువుల వారి ఆశీర్వచనములు, దీవెనలు పొంది వారి స్ఫూర్తితో సువార్త ప్రచారానికై సువిశేష విలువల స్థాపనకై కంకణం కట్టుకోవటం క్రైస్తవులుగా మన విద్యుక్త ధర్మం.

**(సమాప్తం)**

**9 వ పేజి తరువాయి భాగం**

నదులు అడ్డువచ్చినప్పుడు కొంత దూరము ప్రక్కగా ప్రయాణించి ఎక్కడ నది దాటటానికి వీలుగ ఉంటుందో అక్కడే నదిని దాటేవారు ప్రయాణంలో అన్ని పల్లెలు చూసారు.

క్యాంప్‌బెల్ గారు ఓ వారం రోజులు క్లౌదొరతో కలసి హైదరాబాదు, సికింద్రబాదు పట్టణాలను పరిశీలించి అక్కడనుండి అమెరికాలోని బాప్టీస్టు మిషన్ సొసైటి వారికి సికింద్రబాదు కేంద్రంగా సేవ చెయ్యటానికి ఓ సేవకుని పంపించమని ఉత్తరం వ్రాశాడు. మరలా ఎడ్లబండిలో ప్రయాణం చేస్తూ ఒంగోలు వచ్చారు. 1875 జూన్ నెల 23 నుండి క్యాంప్‌బెల్ గారు దక్కన్‌కు నియమితులైనారు. కాంప్‌బెల్ గారు తన భార్యతో కలసి ఎడ్లబండిలో ఒంగోలులో 1875, జూన్ నెల 23న బయలుదేరి జూలై 3న సికింద్రబాదు చేరారు. ఆ మరునాడు ఆదివారము అయినందున వారు విడిదిచేసిన ట్రావెలర్స్ బంగళాలోనే ఆరాధన ప్రారంభించారు.

స్థానికులు, మొదట ఒంగోలు నుండి వచ్చినవారు నలుగురు హాజరయ్యారు, తరువాత ఆదివారంనాడు పదముగ్గురు ఆరాధనకు వచ్చారు. క్యాంప్‌బెల్ గారి భార్య – చాల చురుకుగా చుట్టుప్రక్కల గ్రామలలో సంచరించి పదహారుమంది – మురికిగా చింపిరి నెత్తితో చినిగిపోయిన గుడ్డలు వేసికొనిన పిల్లలను సండేస్కూలునకు పోగుచేసింది. తరువాత ఆదివారానికి ఇరవై ముగ్గురు పిల్లలు సండేస్కూలుకి హాజరయ్యారు.

తరువాత ఎలిమెంటరీ స్కూల్ ప్రారంభించింది. అందులో 47 మంది పిల్లలు వరకు పిల్లలు చేరారు. కాని ఇంతలో పిల్లను బలవంతంగా బాప్తీస్మము ఇస్తున్నారనే వదంతి పాకిపోయింది. అప్పుడు పిల్లలు సంఖ్య 14 పద్నాలుగుకు పడిపోయింది. అయితే క్యాంప్‌బెల్ అమ్మ కృషి వలన రెండు నెలల్లో అరవైకి పెరిగింది.

క్యాంప్‌బెల్ దంపతులు 1875 నవంబరులో సంఘారాధన ప్రారంభించారు. ఒంగోలు నుండి వచ్చిన వారు, నలుగురు స్థానికులు ఇద్దరు మిలటరీ వారు నలుగురు అంతా కలసి 14 మంది అయ్యారు. సంఘస్థాపనలో క్యాంప్‌బెల్ దంపతులు నిర్విరామంగా పని చేశారు –

1876లో మొట్టమొదటిగా ఓ స్థానికుడు బాప్తీస్మము తీసుకొన్నాడు.




# గొప్ప ఆహ్వానము



**ప్రతినెల రెండవ శుక్రవారము రాత్రి 10 గంటల నుండి ఉదయం 4 గంటల వరకు**

## సంపూర్ణ రాత్రి ప్రార్థన జరుగును.

**స్థలము :** యు.సి.యల్.ఐ. చర్చి, బాప్టిస్ట్ ప్రేయర్ హాల్ దగ్గర, ప్రార్థన కొండ (ఒంగోలు కొండ), కొండమిట్ట, ఒంగోలు – 523 001

**మీ వ్యక్తిగత, కుటుంబ అవసరతల కొరకు, అన్ని సమస్యల కొరకు ప్రార్థనలు చేయబడును. రండి కలిసి ప్రభుని ఆరాధించెదము.**

**సెల్: 99088 22 365**

# సువార్తలలోని యేసు కథ

ఐహిక సంపదలను కూడబెట్టుకొని – ఆధ్యాత్మిక సంపదల్ని నిర్లక్షం చేసేవారి గతి అదేవిధంగా ఉంటుంది అన్నాడు. అని అక్కడ నుండి సమాజమందిరము యజమాని ఇంటి వైపుగా వెళ్ళాడు. ఆయన ఇంటిలోనికి పోయిన తర్వాత యూదా – ఫిలిప్పుతో బయటకూర్చున్నాడు. అందరు ఏదో ఒక విషయమై మాట్లాడుకొంటున్నారు.

ఆ ధనవంతుని భూమి బాగా పండితే – ఆ పంట దాచుకోవటానికి అతను తన కొట్లువిప్పి పెద్దకొట్టు కట్టుకోవద్దా అని యూదా ఫిలిప్పునడిగాడు.

ఎందుకు కట్టుకోకూడదు? ఆ మాటకోస్తే ఆ ధనవంతుడు చాల శ్రమించి పండించాడు. తన పనివారికి కూడ మంచి జీతాలిచ్చి వారిని కూడా కష్టపడి పనిచేసే విధంగా సమకూర్చాడు. ఇప్పుడు తన పొలం ప్రక్కన చాలా పొలాలు ఉంటాయి. అవి కూడ పండినవి – కాని ఇతను వాడిన ఎరువులు తీసికొనిన జాగ్రత్తలు గొప్పవి. మిగిలిన వారి పొలాలమీద ప్రకాశించిన సూర్యుడు, కురిసిన వర్షాలు కూడా సమానమే. వారికి కూడ సమృద్ధిగాను విస్తారముగాను పండియుండవచ్చును, పండకపోవచ్చును అన్నాడు ఫిలిప్పు.

అయితే ఈ ధనవంతుడు ఒక్కడే వెర్రివాడెలా అయ్యాడు అన్నాడు యూదా!

వెర్రివాడైనది పంట దాచుకునే పద్ధతి వలన కాదు – పంట జాగ్రత్త చేయవలసినది ప్రభువు రెండు చేపలు అయిదు రొట్టెలను ప్రజలకు పంచిపెట్టినప్పుడు మిగిలిన ముక్కలను కూడా జాగ్రత్తచెయ్యమని చెప్పలేదా! ఇక్కడ ఈ ధనవంతుడు తన పొలముతోనే మాట్లాడుతున్నాడు. తను జీవించి ఉండటానికి – ఈనాడు తనకున్న ఆరోగ్యమునకు అన్నం తినటానికి సరిపడ ఆరోగ్యము, ధరించుకోవటానికి శరీరము ఇచ్చినదేవునికి, వర్షమిచ్చిన దేవునికి, సూర్యుని కాంతి ఇచ్చిన దేవునికి, ఏ మాత్రం కృతజ్ఞత చూపలేదు. తన పొరుగు వారి విషయం ఆలోచించలేదు – దేవుడు మనకిచ్చినవన్నీ ఇతరులకు పంచిపెట్టుటకే అనే విషయం ఆలోచించలేదు.

మనుషుల దృష్టిలో దేవుని చేత ఆశీర్వదించబడిన వానిగా, ఎన్నికైనవాడు, దేవుని దృష్టిలో వెర్రివాడు. దేవుని నామమున మనం ఇతరుల కిచ్చేది. అంత – అంతకు పరలోకములో మనకొరకు భద్రము చెయబడుతుంది.

అయితే మనం ఈ లోకంలో సర్వసమృద్ధిలో – అన్నిటిలో కలిగి ఉండవద్దా అన్నాడు యూదా !

అప్పుడే ప్రక్కన వచ్చి కూర్చున్న నతనయేలు – దేవుడిచ్చింది కొంచెం అయినా మనకు రోజు సమృద్ధి కలిగించగలదు. అందుకనే కదా! మొన్న ఆయన మీ కోసం ప్రపంచంలో ధనాన్ని కూడబెట్టుకోకండి ఇక్కడ ఆ ధనానికి చెదలుపట్టుతుంది. తుప్పు ఈ ధనాన్ని తినివేస్తుంది, దొంగలు పడి దోచుకొంటారు. మీ ధనాన్ని పరలోకంలో కూడబెట్టుకోండి అక్కడ చెదలుపట్టదు, తుప్పుతినివేయదు, దొంగలు పడి దోచుకోరు, మీ సంపద ఎక్కడ ఉంటే మీ మనస్సుకూడ అక్కడే ఉంటుంది అని అన్నాడు కదా!

అయితే ఈ ధనవంతుడు అదే వెర్రివాడు – ఏమిచెయ్యాలి అన్నాడు యూదా.

వెంటనే లెబ్బయి కలిగించుకొని – దశమభాగము ముందు దేవునికివ్వాలి కృతజ్ఞతార్పణ ఇచ్చి తరువాతనే ఆలోచించాలి అన్నాడు. యూదా ఆలోచిస్తు – అదుగో ప్రభువు బయటకి వచ్చారు అని లేచాడు.

“వెర్రివాడా” అనిన మాట ఈ రాత్రి నీ ప్రాణము నడుగుచున్నారు – అనే మాట విన్నవారి మనసులో లోతుగా పనిచేస్తున్నవి. ఎందుకంటే ప్రతి మానవుడు ముందు ఈరోజున ఎలాగఉండాలి? అని ఆలోచిస్తాడు ఈరోజు గడచిపోవటానికి సమృద్ధివున్నవాడు, రేపు ఎలాగడవాలి? అని ఆలోచిస్తాడు. రేపుకూడ గడచిపోయే సామర్థ్యము కలిగిన తర్వాత – చాల సంవత్సరాలు సుఖముగా తిని, త్రాగి, సుఖించాలని కోరుకొంటాడు. అప్పుడప్పుడు మాత్రం దేవుని రాకడగురించి కొంచెంసేపు ఆలోచిస్తాడు.

**(సశేషం)**

చరిత్ర

# సంజీవనాథ స్వామి భుక్కక్షేత్రం

**శ్రీమతి నలంద సాల్మన్ రాజు**

మదిగుబ్బనుండి 3 కిలోమీటర్ల దూరంలో ఆలమూరు గ్రామముంది. ఆ గ్రామస్థులు రాయప్పరెడ్డిగారి బంధువర్గం కావటంతో ఆయన్ననుసరించి పలువులు జ్ఞానస్నాన భాగ్యం పొందారు. వారిలో మరవపల్లి సంస్థానాధీశుడైన గోపు లింగారెడ్డి ముఖ్యులు. లింగారెడ్డిన నుసరించి వారి వంశస్థులందరూ క్రైస్తవ ధర్మాన్ని స్వీకరించారు. "తుమ్మా గోపు" వంశజులననుసరించి అనతికాలంలోనే ఇంద్రెల్లరెడ్డి, పెంటారెడ్డి, దగ్గుల, ఉడుముల, కొమ్మారెడ్డి, ఆదూరి, గాదె, బోయపాటి, బాసాని, అల్లం, యేరువ, వట్టి దుగ్గింపూడి మొదలగు వంశజులు క్రైస్తవులయ్యారు.

యెల్నాటి రెడ్లు గర్వించదగ్గ తమ పూర్వీకుడగు తుమ్మా రాయపరెడ్డి మద్దిగుబ్బ నివాసియని మనం ముందే తెలుసుకున్నాం, ఇక తుమ్మా రాయపరెడ్డి జ్ఞానస్నానం నెలా, సంవత్సరం ఇవ్వనప్పటికి మనం రెండూ గుర్తించవచ్చు. లెగాక్ గారి లేఖ వలన క్రీస్తు జయంతికి మొదటి రోజు రాయపరెడ్డి చనిపోయాడని తెలుసుకున్నాం. అదే లేఖ వలన స్వాములవారి ఇంటిలో నాలుగు నెలలున్నాడని కూడ తెలిసుకున్నాం. దీన్నిబట్టి తుమ్మా రాయపరెడ్డి 1715 సంవత్సరంలో సెప్టెంబరు మాసంలో జ్ఞానస్నానం తీసుకున్నాడనియు మిగతావారు ఆ సంవత్సరాంతానికే క్రైస్తవులయ్యారని నిర్ణయించవచ్చు. రాయపరెడ్డి డిసెంబరు 24వ తేదిన ప్రభు సన్నిధికి చేరుకున్నాడు. మరియు అదే రోజున 14 మంది జ్ఞానస్నానము పుచ్చుకున్నారు. కావున ప్రతి సంవత్సరం ఆ తేదిన అల్నాటి రెడ్లు తమ క్రైస్తవ మతప్రవేశాన్ని ఘనంగా కొనియాడటం సముచితం.

ఆ తరువాత ఈ రెడ్లు ఆలుమూరులో నివశిస్తూ మరాఠా రాజులకు పెద్దమొత్తంలో శిస్తు కట్టవలసిన పరిస్థితి వచ్చినందున గోపు లింగారెడ్డి గారి నాయకత్వాన రాత్రికి రాత్రే పిల్లా జెల్లా, గొడ్డు గోదాతో ఎలా 200 మైళ్ళు దూరంలో ఉన్న వెంకటగిరి రాజావారి (నెల్లూరు పీఠ) భూభాగమైన బుక్కపురానికి చేరుకున్నది మన పెద్దలకు తెలిసిన విషయమే.

కాల్మెట్ గురువర్యులు గండికోట సీమలోని (కడపజిల్లా) కమ్మ కులజులను ప్రప్రథమంగా శ్రీసభ బిడ్డలుగా స్వీకరించారు. వారి స్థానిక నామధేయం సత్యబోధ స్వాములవారు. వారు సెప్టెంబరు 17, 1735 లో వ్రాసిన లేఖలో తొలి కమ్మ మహిళ క్రైస్తవ మత స్వీకారం గురించి విపులంగా వ్రాసారు. ఆమె పేరు అన్నమ్మ ఆమె చాలా కాలంనుంచి పిశాచావహంతో బాధపడింది. నిజ దేవున్ని నమ్మి జ్ఞానస్నానం స్వీకరిస్తే ఆమె పిశాచి బారినుండి విముక్తురాలౌతుందని చెప్పగా, ఆమె నిజ దేవుని దృఢంగా విశ్వసించింది. క్రైస్తవమత విశ్వాస సత్యాలను క్షుణ్ణంగా నేర్చుకుంది. ఆమె ద్వారా ఆమె భర్త, ఆమె బంధువులుకూడా జ్ఞానస్నానం పొందారు. అందుచేతనే పలువురు కమ్మవారి స్త్రీలకు ఈ అన్నమ్మ నామధేయాన్ని పెట్టటం ఆనవాయితి.

అంతేగాక కృష్ణాపురం 15 మైళ్ళదూరాన గల పార్నపల్లెలో కూడ తొలుదొల్త కమ్మవారు క్రైస్తవ మత స్వీకారం చేశారు. వారిలో పొతకమూరి వంశజులు ఆద్యులు. పార్నపల్లెలోని ఓ దళాధిపతి భార్య ప్రోద్బలంతో పలువురు కమ్మవారు జ్ఞానస్నానం స్వీకరించారు. ఇప్పటికి పార్నపల్లెలో చిత్రావతి నది ఒడ్డున ఈ పొతకమూరి వారి బంగళాను చూడవచ్చు. ఆనాటి కరువుకాటకాలు, చిత్రమైన రాజరిక వ్యవస్థ మూలంగా పలువురు గండికోట సీమ కమ్మ వారు గుంటూరు జిల్లాలోని ఓలేరు, తదనంతర ప్రస్తుతం తమిళనాడులోని కిళచ్చేరి,పన్నూరు,మొలసూరు ప్రాంతాలకు వలస వెళ్ళారు. వీరికి గండికోట సీమలోని పొతకమూరు, పందట, యెద్దనపల్లి, పిసికలపాటి, మాలపాడు, ఏటుకూరు, మైలవరం మొదలగుగ్రామాల పేర్లు మీదుగా పొతకమూరి, పూదోట, యెద్దనపల్లి, పిసికలపాటి, మాలపాడు, ఏటుకూరు, మల్లవరపు మొదలగు ఇంటి పేర్లు వచ్చాయి.

బలిజ కులస్థులు మొట్టమొదటగా అనంతపురం జిల్లాలోని కంబాలదిన్నె గ్రామంలో శ్రీసభ సభ్యులయారు.

వివిధ సైన్యాల దాడులకు లోనైన వీరు జేసుసభ గురువుల ఆధ్వర్యంలో ముట్లూరు గ్రామానికి వలస వచ్చారు. 1770లో హైదరాబాదు నవాబగు సలాభత్ జంగ్ 71.5 ఎకరాల భూమిని పునీత ఫ్రాన్సిస్ శౌరివారి గుడికి ఈనాముగా ఇచ్చారు.

ఈ రెడ్లు, కమ్మ, తొగట, సాలె కులస్థుల మతావలంబన గురించి తెలుసుకొన్న మనం వారిని క్రైస్తవులనుగా చేసిన స్వాములవార్ల గూర్చికూడా చెప్పుకోవడం సముచితం. అందులో లెగాక్ స్వాములవారు అగ్రగణ్యులు. వీరు ఫ్రాన్సుదేశంలో బ్రెస్ట్ నందు 1671 జూలై 23న జన్మించారు. ఆ తరువాత జేసుసభలో గురువై భారతదేశానికి 1703వ సంవత్సరములో విచ్చేసి 1733 వరకు తెలుగు ప్రజల మధ్యలో పనిచేశారు. ఈ కాలంలోనే వారి అంకురిత దీక్షతో పలు అగ్రవర్ణాల వారికి క్రైస్తవులయ్యే భాగ్యాన్ని కల్పించారు. ఆ తరువాత నాలుగు సంవత్సరాల కాలం పాటు అనగా 1734 నుండి 1737 వరకు పాండిచ్చేరిలో కర్నాటిక్ మిషన్‌కు పెద్ద (ప్రొవిన్షియల్) గా నున్నారు. తదనంతరం తిరిగి కృష్ణాపురం వచ్చి దాదాపు ఒక సంవత్సరకాలం తన ప్రజల మధ్య పనిచేసి 1738, ఏప్రియల్ 4వ తేదిన పరమపదించారు.

ప్రభువు మరణించిన నాటి రాత్రి అనగా పెద్ద శుక్రవారం రాత్రి నాడే ఆయన మరణించటం ఆయన మహాభాగ్యం, వారి అసలు పేరు లెగాక్ అయినప్పటికి తెలుగు ప్రజల మధ్య సంజీవనాథ స్వాములవారిగానే పిలువబడ్డారు. వారు క్రైస్తవుల అవసరాలను తెలుసుకున్న మహామనిషిగా, ముందు చూపున్న వ్యక్తిగా, పవిత్రతకు మారు పేరుగా గొప్ప ఖ్యాతిని గడించారు. వారిసోదర జేసుసభ గురువులు చాలామంది ఇక్కడి వాతావరణానికి ముఖ్యంగా మండుటెండలకు తాళలేక చాలా పిన్నవయసులో మరణించినప్పటికి, వీరు 67 సంవత్సరాలు మంచి ఆరోగ్యంతో జీవించటం మన తెలుగు క్రైస్తవుల భాగ్యమే అనుకోవాలి. వారి సమాధి ఇప్పటికి కృష్ణాపురంలో ఉన్నది. వారి సమాధికి ఇరువైపుల మరి ఇద్దరి జేసుసభ గురువులగు దివ్యనాధ స్వామి మరియు శౌరినాధస్వాముల వార్ల సమాధులు కూడా మనం చూడవచ్చు. శౌరినాధస్వాముల వారు కలరా రోగులకు సేవచేస్తు 1721లో చనిపోయారు. దివ్యనాధ స్వాములవారు 1730లో చనిపోయారు. కృష్ణాపురం అనంతపురం జిల్లాలోని ముదిగుబ్బ పట్టణానికి 14 కిలోమీటర్ల దూరంలో ఉన్నది. కాని ఆనాడు అంతటి ప్రాముఖ్యం పొందిన కృష్ణాపురంలో నేడు ఒక్క క్రైస్తవుడు లేడు. అట్టి గొప్ప చరిత్రక ప్రాశస్త్యమున్న ఈ గురువుల పవిత్ర సమాధులు ఆలనాపాలనా లేక శిధిలమయ్యాయని బ్రిటిష్ కలెక్టర్ గుర్తెరిగి చంద్రునికో నూలుపోగులా 1905లో సమాధులు కట్టించి, వారి పుట్టు పూర్వోత్తరాలతో చక్కని శిలాఫలకములను వేయించి ప్రహరిగోడను కట్టించి, వాటి భద్రతకై సంవత్సరానికి కొంత భరణాన్ని సైతం కేటాయించారు. ఇంతటి విశిష్ట ప్రాధాన్యమున్న కృష్ణాపురం గ్రామంలో కొన్ని దశాబ్దాలుగా క్రైస్తవులెవరూ లేనందున ఆ గురువుల సమాధులు బహిర్భూములయ్యాయి. కాని శిలాఫలకాలు మాత్రం చెక్కుచెదరలేదు.

మరుగున పడిన తెలుగు క్రైస్తవుల చరిత్రను వెలికి తీసి ఆ పుణ్యపురుషుల మహనీయ జీవితాలు వారి త్యాగాలు, సువార్త సేవలు మనకు ఆదర్శంగా ఉండాలనే సదుద్దేశంతో ఆంధ్ర జేసుసభ సభ్యులు 1995లో కష్ణాపురం గ్రామాన్ని చేరుకున్నారు. తెలుగు శ్రీసభ బుడిబుడి నడకలు 1703లో కృష్ణాపురంలో ఆరంభమై ఇంతింతై వటుడింతై అన్నట్లుగా నేడు మూడు శతాబ్దాల నిండు ఆయుష్షుతో ఆంధ్రావని నలుచెరగులా పదమూడు గురుపీఠాలల్లో 15 లక్షల విశ్వాసులతో, తమిళనాడులో నాలుగు గురుపీఠాలలో సుమారు అరవై వేల మంది విశ్వాసులతో విరాజిల్లుతూ, త్రిశతాబ్ది ఉత్సవాల సమాయత్తంలో భాగంగా కృష్ణాపురంలో ఆనాటి పవిత్రతను పునరుద్ధరించి అక్కడ చక్కని స్మారక పుణ్యక్షేత్ర మందిరాన్ని మరియు గురునిలయాన్ని నిర్మించ పూనుకున్నారు. కర్నూలు పీఠాధిపతులు శ్రీశ్రీ గోరంట్ల జ్వాన్నేసుగారి స్వహస్తాల మీదుగా నవంబరు 23, 2002న శంకుస్థాపన గావించబడిన ఈ మఠం ఆంధ్రజేసుసభ

**మిగతాది 23 వ పేజీలో..**

# అంధుల లిపి నిర్మాత - లూయిబ్రెయిల్

(చరిత్రను మంచి మలుపులు తిప్పిన మహనీయులు ఎందరో ఉన్నారు. అలాంటి వారి జీవిత చరిత్రలను తెలుసుకోవడం వల్ల మనకు స్ఫూర్తి కలుగుతుంది వికలాంగుల పరిస్థితి శోచనీయమైనది. వారిలో అంధుల పరిస్థితి మరి దయనీయంగా ఉంటుంది. వారికోసం ఒక లిపిని నిర్మించి, వారి జీవితాలలో వెలుగును నింపిన నిరంతర పరిశోధకుడు లూయి బ్రెయిల్, ఆయన కథ ఇది.)

అంధుల ప్రపంచానికి అందించిన లిపి ద్వారా చిరస్మరణీయుడైన "లూయి బ్రెయిల్" 1809వ సంవత్సరం జనవరి 4వ తేదిన. ప్యారిస్‌కు 20 మైళ్ళ దూరాన ఉన్న "క్రూవే" అనే గ్రామంలో గుర్రపు జీన్లు తయారుచేసేవారి కుటుంబంలో జన్మించాడు. అప్పుడు 44 సంవత్సరాల వయస్సులో ఉన్న అతని తండ్రి ఈ పసికందే తనకు పెద్దతనంలో తోడుగా ఉంటాడని గర్వంగా చెప్పుకున్నాడు.

లూయిబ్రెయిల్ మూడుసంవత్సరాల ప్రాయంలోనే తన ఇంటి ప్రాంగణంలో, తన తండ్రి గుర్రపు జీన్లు తయారుచేసుకునే గది చుట్టుప్రక్కల కేరింతలు కొడుతూ ఆడుకునేవాడు. ఉత్సుకతతో చూచే లూయి కళ్ళకు ప్రపంచంలోని ప్రతి వస్తువు అందంగా ఆనందదాయకంగా కనిపించేది. తన తండ్రి పనిచేసుకునే గది, దానిలోని పనిముట్లు పదునైన కత్తులు అతనికి తెలియనివి అయినప్పటికి అతనిని ఆకర్షించేవి. ఒకరోజు తన తల్లిదండ్రులు తమ పనిలో నిమగ్నులై ఉండగా ఒక చిన్న తోలు ముక్క కత్తి తీసుకొని తన తండ్రిని అనుకరిస్తూ ఉండగా కత్తి ఎగిరి కంటిలో గుచ్చుకొంది. కంటి నుండి రక్తం ధారాపాతంగా కారింది. అతని తల్లిదండ్రులు కాని, వైద్యులు కాని, ఏమి చేయలేకపోయారు. కొన్ని నెలల తర్వాత జబ్బుతో అతడు తన రెండవ కంటిచూపును కూడా కోల్పోయాడు. దీనితో లూయి మూడు వసంతాల గడవకముందే ప్రకృతిలోని అందాలను చూచే అవకాశం లేకుండా అంధుడయ్యాడు.

అంధుడైన లూయి తన అక్కచెల్లెళ్ళతో తమ గ్రామంలో ఉన్న మామూలు బడికి వెళ్ళనారంభించాడు. లూయి ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను వింటూ తన విద్యను కొనసాగిస్తూ, ఒక మంచి విద్యార్థిగా పేరు తెచ్చుకున్నాడు. అతని సూక్ష్మ గ్రహణ శక్తికి ఉపాధ్యాయులు ఆశ్చర్యపోయేవారు. తన కుమారుని కష్టాన్ని తొలగించడానికి లూయి తండ్రి చాసా కష్టపడి చిన్న చిన్న మేకులను చెక్క అక్షరాల ఆకారంలో పేర్చేవాడు. ఆ మేకులను వ్రేళ్ళతో తడుముంటూ లూయి అక్షరాలను నేర్చుకున్నాడు.

వాలంటీస్ హవే ప్రపంచంలో మొట్టమొదటి అంధుల ప్రత్యేక పాఠశాలను 1784లో ప్యారిస్‌లో స్థాపించాడు. ఆయన తన పాఠశాలలోని విద్యార్థులు అక్షరాలను చేతితో తడిమి గుర్తుపట్టేటట్లుగా కాగితంపై అక్షరాల ఆకారాన్ని ఉబ్బెత్తుగా వచ్చేటట్లు చేసేవాడు. దీనిని "లైన్‌టైప్" అని పిలిచేవాళ్ళు, ఈ విధంగా హవే ప్రపంచంలోని మొట్టమొదటి అంధుల పాఠశాల నిర్మాతగా పేరు గాంచాడు.

లూయి 1819వ సంవత్సరంలో హవే స్థాపించిన ఆ పాఠశాలలో చేరాడు. ఆ సమయంలో అంధులకు విద్యాబోధన కార్యక్రమాలు ప్రారంభదశలో ఉన్నాయి. లూయి, హవే కనిపెట్టిన "లైన్‌టైప్" పద్ధతినే నేర్చుకొని ఎంతో తెలివిగల విద్యార్థిగా పేరు తెచ్చుకున్నాడు. అతని కార్యదీక్షకు, మేధాసంపత్తికి నిదర్శనం అతను పదిహేడు సంవత్సరాల వయస్సులోనే తను చదివిన పాఠశాలలో ఉపాధ్యాయునిగా నియమితుడుకావటం.

లూయి, హవే కనిపెట్టిన ఈ "లైన్‌టైప్"ను అభ్యసించినా, దాని మీద మక్కువ మాత్రం పెంచుకోలేక పోయాడు. అతన్ని ఎన్నో ప్రశ్నలు వెంటాడేవి. అతను పగలంతా విద్యబోధన చేస్తున్నా రాత్రులలో అంధులు రాయగల చదవగల ప్రత్యేక లిపికోసం కష్టపడుతూ ఉండేవాడు. ఆ కాలంలో చాలా రకాల "లైన్‌టైపు"లను అనుసరిస్తూ ఉండేవాళ్ళు. వాటిలో హవే "ఇటాలిక్‌టైప్" డాక్టర్ ప్రై "రోమన్‌టైప్" డాక్టర్ మూన్ "మూన్‌టైప్" ప్రసిద్ధి

గాంచాయి. ఇవేవీ లూయి ప్రశ్నకు సరైన సమాధానం చెప్పలేకపోయాయి.

1821వ సంవత్సరంలో సైనిక అధికారిగా పదవి విరమణ చేసిన చార్లెస్ బార్బియర్‌ను లూయి కలపటం తటస్థించింది. బార్బియర్ తన సైనికులు రాత్రులలో కూడా సమాచారాలను తెలుసుకునేందుకు ఉపయోగపడే ఒక ప్రత్యేక లిపిని రూపొందించాడు. అతను 12 గంద్రని ఉబ్బెత్తు చుక్కలను కాగితంపై రాసేవాడు. వాటివరస క్రమాన్ని మారుస్తూ అక్షరాలను, గుర్తులను తెలుకొనేటట్లు సైనికులకు శిక్షణ ఇచ్చాడు. వాటిని చూడగానే లూయికి అప్పటివరకు తన అంతరాలలో నిద్రాణమైయున్న "అంధులకు ప్రత్యేకలిపి ఎలా?" అనే ప్రశ్నకు సమాధానం దొరికింది. లూయి "రాతి రాత"ను తన విద్యార్థులకు బోధించటానికి బార్బియర్ అనుమతి తీసుకున్నాడు.

బార్బియర్ రూపొందించిన 12 చుక్కల లిపి మరి పెద్దదిగా ఉండి, చేతి వ్రేళ్ళమొనలతో తడిమి చూడటం కష్టం కాబట్టి అంధుల చేతి వ్రేలితో తేలికగా అక్షరాలను గుర్తుపట్టగలందులకై లూయి 12 చుక్కలను 6 చుక్కలకు కుదించాడు. బార్బియర్ తనకు బహుమతిగా ఇచ్చిన రాత పలకను ఉపయోగిస్తూ, ఈ ఆరు చుక్కలను ఆ పలకమీద అనేక వరసక్రమాలతో మారుస్తూ కొత్త కొత్త వరసలను వృద్ధిచేస్తూ లూయి చివరకు 1832వ సంవత్సరంలో ఈ ఆరుచుక్కల కొత్త లిపిని రూపొందించినాడు. ఈ చుక్కల ద్వారా అక్షరమాలలోని ప్రతి అక్షరాన్ని, ఉచ్చారణను అనుసరించిన గుర్తులను, లెక్కలకు సంబంధించిన సాంకేతిక పదాలను, సంగీతానికి సంబంధించిన గుర్తులను (చిహ్నాలను) తేలికగా రాయవచ్చు.

ఈ లిపి వల్ల ఉన్న ఉపయోగాలను అతను విపులంగా వివరించినా, ఆ లిపికి అధికారుల గుర్తింపు మాత్రం లభించలేదు. తన విశ్రాంతి సమయంలో విద్యార్థులకు ఈ లిపిని ఇంటివద్ద బోధించటానికి మాత్రం "రాయల్ సంస్థ" అంగీకారం తెలిపింది.

తాను రూపొందించిన లిపికి అధికారుల గుర్తిపు సంపాదించడానికై లూయి పడిన శ్రమ వల్ల అతని ఆరోగ్యం రోజురోజుకూ క్షీణించసాగింది. దానివల్ల ఆయన తన ఉపాధ్యాయ వృత్తిని కూడా వదిలి వేయవలసివచ్చింది. 1851వ సంవత్సరం డిసెంబర్ నెలలో ఆయన ఆరోగ్య పరిస్థితి ప్రమాదకరంగా పరిణమించడం వల్ల, ఆయనను రాయల్ సంస్థ వారి వైద్యశాలలో చేర్చారు. లూయి 1852వ సంవత్సరం జనవరి ఆరవ తేదిన తన దేహయాత్ర చాలించాడు. అయన మృతదేహాన్ని తనవారి ప్రక్కనే విశ్రాంతి తీసుకొనేందుకై "క్రూవే" గ్రామానికి తరలించారు.

అధునిక కాలంలో 30 సంవత్సరాలపాటు లూయి అంధులకోసం చేసిన పరిశోధన చాలా గొప్పది. లూయి ఎంత నిరాడంబర జీవితాన్ని గడిపాడో, అంత ప్రశాంతంగా నిష్క్రమించాడు. ఆయన లిపికి మాత్రం అధికారికమైన గుర్తుంపు లభించలేదు. ఆయన సమకాలికులు కూడా లూయి రూపొందించిన లిపిని గురించి ఎక్కువ శ్రద్ధ చూపలేదు.

లూయి బ్రెయిల్ మరణించిన రెండు సంవత్సరాల తరువాతే రాయల్ సంస్థలోని విద్యార్థులు తమ అభిమాన ఉపాధ్యాయుడు రూపొందించిన లిపిని అధికారికంగా బోధించాలని సంస్థపై ఒత్తిడి తీసుకొని వచ్చారు. వారు ఆ లిపిని ''బ్రెయిల్‌లిపి'' గా పిలిచారు. ఇంగ్లాండ్, అమెరికాలలోని మేధావులైన అంధులు కూడా బ్రెయిల్ లిపి ప్రాముఖ్యాన్ని గుర్తించి, చర్చలు ప్రారంభించారు. వారి ఆందోళన 300 సంవత్సరాలపాటు కొనసాగింది. బ్రెయిల్ లిపిపై ఎన్నో పరిశోధనలు చేసి, అంధులకు విద్యాబోధన చేయడానికి ఈలిపి ఎంతో ఉపయోగకరమని నిర్ధారించారు.

లూయి మేధా సంపత్తికి, ఆయన చేసిన అవిరళ కృషికి ఒక శతాబ్ధం తరువాత గుర్తింపు లభించింది. ఫ్రాన్స్ వారు ఆయన లిపిని అధికార లిపిగా గుర్తించారు. 1852వ సంవత్సరంలో తమ దేశపు గొప్ప బిడ్డగా ఫ్రాన్స్ జాతి ఆయనకు నివాళులు అర్పించింది. ఆయనను తాము పూజించే దేవతల సరసన నిలిపింది.

బ్రెయిల్ రూపొందించిన లిపి నేటికి 160 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఈ రోజు అన్ని ఖండాల దేశాలలోను బ్రెయిల్ లిపినే ఉపయోగిస్తున్నారు. అంధుల లిపి కోసం లూయి బ్రెయిల్ చేసిన కృషి చిరస్మరణీయం.

**(సమాప్తం)**

## ఆస్ట్రేలియన్ నన్‌కు సెయింట్ హుడ్

డిసెంబర్ 21, మాకిల్లాప్ అనే ఆస్ట్రేలియాకు చెందిన మహిళ జీవించివున్నప్పుడు ప్రదర్శించిన రెండో మహిమను కూడా పోప్ బెనెడిక్ట్ - 16 శనివారం ఆమోదించారు. ఈ మహిళకు 'సేయింట్ హుడ్' ఇవ్వడానికి అవసరమైన ప్రక్రియలో ఇది ఒక భాగమని వాటికన్ వెల్లడించింది. వందేళ్లకుపైగా జీవించిన ఈ మహిళకు సేయింట్ హోదా దక్కితే ఆ గుర్తింపు పొందిన తొలి ఆస్ట్రేలియా మహిళ ఈమెనే అవుతుంది.

## క్రిస్మస్ చెట్టు రూ. 2.5 కోట్లు

ఇది ఓ బంగారు చెట్టు. వజ్రాలు పూస్తే ఎలా ఉంటుంది. దగదగ మెరుస్తూ కళ్లు మిరమిట్లు గొలపదూ....! ఇలాంటి చెట్టు తమిళనాడులోని తిరునెల్వేలివాసులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తోంది. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని తిరునెల్వేలిలోని మేలరథై వీధిలో జాయ్ ఆలుకాస్ నగల దుకాణం వారు బంగారంతో క్రిస్మస్ చెట్టు తయారు చేశారు. 9.8 కిలోల బరువు ఉండే ఈ చెట్టుకు వజ్రాలు పొదిగారు. దీని విలువ రూ2.5 కోట్లు. దీనిని ప్రజల సందర్శనార్థం 24వ తేదీ వరకు ఉంచారు.

**హన్నాకృప జనవరి పత్రిక తయారుచేయు సమయంలో కంప్యూటర్‌లో తలెత్తిన సమస్యల వలన కొన్ని చోట్లప్రూఫ్ దిద్ద బడలేదు.దయతో మన్నింపమనవి.**

North East West South వార్తలు

## హన్నమ్మ గారి 27వ సంస్మరణ స్తుతి కూడిక

జనవరి 22: హన్నాకృప స్ఫూర్తియైన శ్రీమతి హన్నమ్మగారి 27వ సంస్మరణ స్తుతికూటము జనవరి 22 శుక్రవారం 2010 ఒంగోలు, క్లౌపేట, కృపాదానం వీధిలోని ప్రభువు సంఘమునందు ఉదయం 11గంటలకు ప్రారంభమైనది.

హన్నమ్మగారి రెండవ కుమారుడు బిషప్. రెవ. డా ॥ జోసఫ్ కొడవటికంటి గారు వాక్యపరిచర్య చేసిరి. రెవ. డా ॥ కె. రత్నకుమార్ గారు- ఒలీవ మినిస్ట్రీస్ & యాక్ట్స్ , చిలకలూరిపేట- అధ్యక్షతలో కార్యక్రమం జరిగింది.

హన్నమ్మగారి యొక్క ఆత్మీయ జీవితం గురించి ఆమెచేత ప్రభువులోనికి నడిపించబడిన వారి అనేకుల సాక్షాలతో ప్రభువు ఘనపరచబడ్డాడు. హన్నమ్మగారి సంతానం 12 మంది బిడ్డలు అందరు ప్రభువు సేవలో ఉండటం ధన్యమని వక్తలు తెలియజేశారు.

అలాగే వీరి మనుమలు, మునిమనుమలు ఖచ్చితంగా 100 మంది. కాని అదే రోజున హన్నమ్మ గారి పెద్దకుమారుని ఆఖరికుమారుడు నతానియేల్ ( హన్నాకృప ఎడిటర్ ) - వాణి జెస్సీలకు ప్రభువు ప్రధమ సంతానం ఇచ్చినందున సంఖ్య 101 కి చేరింది.

అందువలన ఆ శిశువుకు హేనగ్రేస్ (హన్నాకృప) అను నామకరణం చేశారు.

## ఘనంగా " నా కుటుంబము " పుస్తక ఆవిష్కరణ

జనవరి 22: రచయిత కొడవటికంటి గారి 16వ రచన " నా కుటుంబము " అనే నవలా రసమాలికను హన్నమ్మగారి జ్ఞాపకార్ధ స్తుతికూటములో రెవ . హడ్సన్ గొరికపూడి గారు ( హైదరాబాదు ) ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డా ॥ హుస్సేనయ్య గారు ,శ్రీ పార్వతి నర్సింగ్ హోమ్, బేస్తవారిపేట, డా ॥ గిరిధర్ గారు ముఖ్య అతిధులుగా హాజరయ్యారు.

రెవ. విజయచంద్ర , బెంగుళూరు ఈ కార్యక్రమ అధ్యక్షులుగా సభను నడిపించారు. ఎక్లెషియా ఎక్విప్ మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షులు రెవ . గ్రిప్సన్ తేళ్ల, హైదరాబాదు గారి చేతుల మీదుగా డా ॥ హుస్సేనయ్య గారికి అంకితమియ్యబడిన కృతిని వారు స్వీకరించారు.